రాగాలాపన

(కవితా సంపుటి)

రమేష్ గైక్వాడ్ 'రాగా'

రాగాలాపన

- రమేష్ గైక్వాడ్ 'రాగా'

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2003

ప్రతులు : 1000

వెల రూ : 40/-

ప్రతులకు :

రమేష్ గైక్వాడ్ 'రాగా'

13-2-267/ఎ/82,
రహీంపుర,
శివలాల్ నగర్,
హైదరాబాద్ - 500 006.

వి. ప్రవీణ్‌కుమార్ ఫోన్: 040-55697302
ప్రిన్సిపాల్
ఉషోదయ మాడల్‌స్కూల్
హైదర్‌గుడా,
హైదరాబాద్ - 64.

డా॥ మొహమ్మద్ అలీ ఫోన్: 040-27660818
కరెస్పాండెంట్
సాధనా పారా మెడికల్
ఒకేషనల్ జూనియర్ కాలేజ్,
3వ అంతస్తు, రాంనగర్ 'X' రోడ్, హైదరాబాద్ - 500 020.

PRINTED BY :

JSB Printers Pvt. Ltd.

14, Cellar 'A' Block, Archana Enclave, East Marredpally, Secunderabad - 500 026. A.P. INDIA
Tel : +91-40-55220114, 56462497, 27709083,
Tele Fax : +91-40-27801805, www.jsbprinters.com, E-Mail : info@jsbprinter.com

అంకితం



స్వర్గీయ అమ్మ
పద్మాబాయి గారికి

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy M.P.
M.A. Ph.d. D.Litt.
CHAIRMAN
Andhra Pradesh State Cultural Council
Government of Andhra Pradesh
Kalabhavan, Hyderabad - 500 004.
Phone : (O) 23214603 (R) 23548451
Fax : (O) 23214603

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి, ఎం.పి.
ఎం. ఏ. పి. హెచ్. డి. డి. లిట్.
అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
కళాభవన్, హైదరాబాదు 500 004
ఫోన్ (ఆ) : 23214603 (ని) : 23548451
ఫాక్స్ (ఆ) : 23214603

అభిప్రాయం



రమేశ్‌గైక్వాడ్ కలంపేరు 'రాగా'. ఈ కవితా సంపుటిలోని ఆలాపనలు 'రాగా' కవి ఆలాపనలే. రాగయుక్తంగా పాడుకునే గీతాలు కావు. అన్నీ వచన కవితలే.

రమేశ్‌గైక్వాడ్ మాతృభాష మరాఠీ అయినా హిందీలో ఎం. ఏ. పట్టం పొంది తెలుగులో కవితలు రాయడం అభినందనీయం.

రకరకాల సందర్భాల్లో వివిధ విషయాలపైన రాసిన కవితలు ఈ సంపుటిలో ఉన్నాయి. కొన్ని అనుభూతి పరంగా వున్నాయి. మరికొన్ని సమకాలీన జీవిత పార్శ్వాలను చిత్రించేవిగా వున్నాయి. ఏ కవిత రాసినా దాంట్లో తన ఆత్మవేదనను, సమసమాజ భావనను ప్రకటించే ప్రవృత్తి కనిపిస్తుంది. తన మానసిక స్పందనలను "రాగాలాపన"గా అందిస్తున్న రమేశ్ గైక్వాడ్‌కు నా అభినందన.

(డా॥ సి. నారాయణ రెడ్డి)

అవధాన సరస్వతీ పీఠమ్

అవధాన సహస్రఫణి

బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ



మాతృభాష మరోభాష అయినా తెలుగు తన స్వంత గొంతుకగా చేసుకొని తెలుగును స్వరాలుగా మలచుకొని శ్రీ రమేష్ గైక్వాడ్ చేసిన 'రాగా' లాపన. ఇది.

'కళ్ళల్లో నీటిని తుడిచి - దారిచూసేదే సంస్కృతి'

సంస్కృతిక సమాజపరంగా ఎంతగొప్ప అర్థం చెప్పాడు ? ప్రవహించే చెమట బిందువుల్లో సహజ సుగంధాలను చూడటం 'ఒక్కసారి నా హృదయాంతరాన్ని అర్థం చేసుకొనే వారిని చూడాలని ఉంది అనడం గుండెలు మిగిలిన ఓ చిటికెడు ఆశ నమ్మకం' అనటం ఆయన అనుభూతి రమ్యతకు అద్దం పడుతున్న వాక్యాలు.

'కొండ చిలువలా బద్ధకంగా పడివున్న తారురోడ్డు' ఇటువంటి ఎన్నోచోట్ల క్రొత్త ఉపమలు సంధించగలిగిన శ్రీరమేష్ గైక్వాడ్ 'విదేశీయులు సైతం కోరుకున్న నాదేశం స్వర్గభూమిరా' అంటూ మాతృదేశభక్తిని ఆకాశానికి ఎత్తి 'నభమెంత మురిసిందో' అంటాడు.

భాషలోనూ, భావంలోనూ, పద శబ్దానుసంధానంలోనూ, స్పష్ట ప్రకటనలోనూ ఈతనిదొక ప్రత్యేకమైన నూతనశైలి. ఒక కవికి ఉండవలసిన సమగ్ర లక్షణాలతో 'రాగాలాపన' చేశాడు, ఈ యువకవి. దాదాపు 60 శీర్షికలతో జీవనగోళములోని అన్ని పార్శ్వాలను స్పృషించిన ఈనవకవిని మరిన్ని ఉత్తమ కవితా ఖండికలతో ఆధునికి కవితా సారస్వాత ప్రపంచాన్ని పుష్టీకరించవలసినదిగా ఆశీర్వదిస్తున్నాను.

(బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ)

మానవతా జాతీయవాదానికి స్వాగతం

డా॥ కసిరెడ్డి

మా కూలోలజిల్లా పాలమూరులోని నారాయణపేటలో జన్మించి, హిందీ భాషలో సాహిత్యాధ్యయనం చేసి, రాజనీతి శాస్త్రోపన్యాసకునిగా పనిచేస్తూ, విద్వాన్, సాహిత్యరత్న, శిక్షక్ పరీక్షలు పూర్తిచేసి, చిన్న వయస్సులోనే పలు సంస్థల ద్వారా ఆరేడు పురస్కారాలందుకొని, అనేక పత్రికల్లో కవితలు వ్రాస్తూ, మాతృభాష మారాఠీతోపాటు, హిందీ, కన్నడ, ఆంగ్ల భాషలను అధ్యయనంచేసి, తెలుగులో కవిత్వం వ్రాస్తూ "రాగాలాపన" చేస్తున్న యువకవి శ్రీ రమేశ్‌గైక్వాడ్.

గైక్వాడ్ అనగానే దేశరక్షణకు అంకితమైన రాజులు, జాతీయోద్యమం - తత్ఫలితాలు గుర్తుకు వస్తాయి. అది రాజదండం మంత్రదండం పట్టిన కాలం. ఇది దేశ-సమాజ-వ్యక్తి రక్షణ-వికాస-చైతన్యాలకు కలం-హలం పట్టేకాలం, గళం విప్పేకాలం అవసరం వస్తే సరిహద్దుల్లో గన్నుపట్టేకాలం. దేశకాలపరిస్థితులనుబట్టి ఈపరిణామం ఎవరిలో అయినా సహజంగావచ్చేదే. అవచ్చే పరిణామంవల్ల కొందరు తమకున్న అధికారంతో సమాజసేవ చేస్తారు. కొందరు తమకున్న ధనంతో సేవాకార్యక్రమాల్లో పాల్గొంటారు మరికొందరు జ్ఞానదానులై వ్యవహరిస్తారు. ఇంకా కొందరు తమశక్తితో (బలంతో) సమాజసేవ చేస్తారు. దీనినే "తన్‌మన్-ధన్" సమర్పించి పనిచేయడమంటారు.

ప్రాచీన పరంపర తెలిసి, ఆధునిక విద్యాశాస్త్రవేత్త అయి, తన మనోభావాలకు అక్షరాకృతినిచ్చి పత్రికల్లో ప్రచురిస్తూ, వేదికలపై చదువుతూ సమాజంలో తానొక్కరై ప్రగమిస్తున్న యువకవి మిత్రులు శ్రీ రమేష్‌గైక్వాడ్.

వారి భావాలను అక్షరాలలో క్రమబద్ధంచేసి రాగాలాపన చేస్తున్నారు.

ఇవన్నీ వచన కవితలు, అక్కడక్కడ వచనగేయాలు ఉన్నాయి. వచన కవిత, వచన గేయం, వచన పద్యం ఒకే అర్థంలో వాడిన వారూఉన్నారు.

"చెప్పకుండనే ఏదో ఒక ఛందంలో
కచ్చితంగా కలిపలకడం ఖాయం
అంతకుమించి కవిత్వం రాయడం
ఐంతి లేకుండా ఫూట్‌బాలాడ్డం" అన్నారు అరుద్ర.

వచన కవితే అయినా బాహ్యనిర్మాణం మీద, అంతర్నిర్మాణం మీద దృష్టి సాదించాల్సిందే. సాధారణ వాక్యానికి, ఈ వచన కవితా పంక్తికి ఈ నిర్మాణంలోనే తేడా ఉంటుంది. తానుచెప్పాలనుకొన్న అంశానికి ప్రాధాన్యం వస్తుంది. అ అంశాన్ని అభివ్యక్తీకరించే పదం ప్రధాన స్థానంలో వచ్చికుచుంటుంది. రచయిత దేనిని ఒత్తి పలుకుతున్నాడో అప్పుడే తెలిసిపోతుంది.

అయితే తీసుకొన్న వస్తువును, ఎన్నుకొన్న రూపాన్ని, రామణీయకంగా శిల్పీకరించి నప్పుడు మాత్రమే ఏకవిత అయినా పఠితలను వెంటనే పట్టి నిలుపుతుంది.

శ్రీ రమేష్‌గైక్వాడ్ ఈమూడింటిమీద (వస్తురూప-శిల్పాలమీద) దృష్టి సాధించే ఈరచన చేశారు. అరవై కవితల్లోనూ ఈ దృష్టికనిపిస్తుంది.

"అల్‌కబీరుకు మూగప్రాణాలు బలికావడం, దేశాన్ని గాట్‌దోచుకోవడం, మాతృమూర్తి గర్భంలోకి కత్తులు దూయడం, మనసుపక్షిగాలించడం, చరిత్రంతా నెత్తుటి పూటలతో నిండిపోవడం, అసత్యం సత్యాన్ని కప్పి వేయడం, ప్రజా స్వామ్యానికి శీలం చేజారిపవడం, ఆడది పట్టపగలు కూడా గడపదాటి నడవలేకపోవడం, బాల బాలికల బానిసత్వం ఇంకా కొనసాగడం, దేశం తగవులతో రగులుతుండడం, అనుభావాలు మధుల ముంగిట్లో పక్కుల్లా ఆడుకోవడం, గునాపాలు గుచ్చినప్పుడు గుండె కావ్యమై పారడం, సుఖదుఃఖాలు లెక్కిస్తూ రాత్రులు మౌనంగా మాటాడుకోవడం, మరో స్వాతంత్ర్య పోరాటానికై ఆరాటపడడం, ప్రార్థనా నియమాలు అర్థానికి ప్రధాన్యమివ్వడం, కరుణా వర్షాల ఆగమనానికి ఎదురు చూడడం, వరకట్న వ్యథలకు కనలడం, రుధిరవర్షాలకు అదరడం"...

ఇలా వందలాది వస్తువులను గ్రహించి హృదయం ద్రవించి, స్పందించి రచన చేసిన ఈ యువ కవి మిత్రులు అక్కడక్కడ కవితాత్మనూ సమాశ్రయించారు. మానవతా జాతీయవాద కవిగా స్పందించి రచించారు.

- ప్రజాస్వామ్యానికి శీలంచే జారింది
- గుండె కవ్యమై పారుతుంది
- నవ భారత నిర్మాణం నా గీతం
- రంగులు పరవశించాయి
- నిజాలు జీర్ణించుకోలేని అవకాశ వాదులు
- చట్టపు పుటల్లోంచి/ ఊడిపడిన మానవత్వం.
- నీ పెదలపై పాటలుగా మారాలని
- శోక పూలోకంలో నేనే ఒంటరివాణ్ణి
- వాడిన పువ్వుల్లో చిరునవ్వులు

ఇలా కొన్ని వందలు ఈ రాగాలాపనలో చూపించవచ్చు. ఈ యువకవి ప్రతిభాకేతనం ఎగురవేయవచ్చు

ఈ యువకవి – సుకవి
సుకవులు చెప్పిన కవితా
నికరములు శిలాక్షరమాల నిలకడ గాంచున్
కుకవులు చెప్పిన కవితా
నికరములు జాలాక్షరముల నీచవనణగున్

అన్న మడికసింగన మాట స్వీకార్యం. ఈ యువ కవి మిత్రుల కవితల్లో ఎన్నో నిలచేవి, హృదయంలో పదిల పరచుకొనేవి ఉన్నాయి. ఇటువంటి కవితలు ఇంకా అందించి, యువ పాఠకుల ఆలోచన రచనలు తెరిపించాలని ఆకాంక్షిస్తూ ఈ రాగాలాపనకు స్వాగతం పలుకుతున్నాను.

డా॥ కసిరెడ్డి
కార్యదర్శి
జాతీయ సాహిత్య పరిషత్
ఆం.ప్ర.


భాగ్యనగర్
7-04-2003

మా మది




మేధాశక్తితో కవి ప్రపంచాన్ని జయిస్తాడు. ఊయటి మరియు చేదు నిజాలెన్నో మనందరికి పంచిపెడతాడు. 'రాగా' అనేక విషయాల్ని జీర్ణించుకుని కవితా రూపంలో ఈ లోకానికి అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇందులో కవి సహజ గుణం స్పష్టమవుతున్నది. రాగాలాపనకు మంచి ఆదరణ లభిస్తుందని అభినందనలతో

ప్రీతం సింఘ్
రిటైర్డ్ యస్. పి. మరియు సెక్రెటరీ, సిఖ్ ఎడ్యుకేషన్ సొసైటి
3-5-578, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29.




విభిన్న విషయాలపై కవి స్పందించి తన భావాలను వ్యక్త పరచడంలో దాదాపుగా విజయం సాధించినట్లే భావాభివ్యక్తీకరణ చాలా బాగుంది.

వి. ప్రవీణ్ కుమార్
ప్రిన్సిపాల్, ఉషోదయ మాడల్ స్కూల్ హైదర్‌గుడా, హైదరాబాద్



నవయువకులలో ప్రేరణ కల్పించి మార్పులు తేవాలి. ఆలోచనలు మంచివైనప్పుడు పని సాఫీగా జరుగును. శ్రీ రమేష్ గైక్వాడ్ గారి పుస్తకం నలుగురుకి ఉపయోగ పడుతుందని అభినందనలు

అచ్యుత్ కుమార్ జైన్
సంఘ సేవకులు




కవి ప్రభావం సమాజంలోని అనేక రంగాలలో చెక్కుచెదరక ఉంటుంది. మార్పును కోరుకుని ఆశాజ్యోతులను వెలిగించి లక్ష్యసాధనలో నిమగ్నమయ్యే వ్యక్తి కవి. 'కవిరాగా' ఈ కవితా సంకలనం వెలువడటం నాకెంతో సంతోషాన్ని కల్గించింది. ముందు ముందు ఇంకా మంచి కవితలు రావాలని కోరుతూ

ధర్మపాల్ నగరి
మాజీ అధ్యక్షులు
సోమవంశ సహస్రార్జున్ క్షత్రియ సమాజ్, హైదరాబాద్



ఒక వైపు కవిగా, అధ్యాపకులుగా మరోవైపు సంఘ సేవకులుగా పని చేస్తూ సవ్యసాచిగా ముందుకు సాగిపోతున్నారు మిత్రులు శ్రీ రమేష్ గైక్వాడ్. ఎన్నో రోజులుగా వేచిచూస్తున్న 'రాగాలాపన' రాగా ఆనందాన్ని పంచుకుని అభినందిస్తూ

డా॥ మొహమ్మద్ అలి
చైర్మన్ అండ్ కరెస్పాండెంట్
సాధన పారా మెడికల్ వొకేషనల్ జూనియర్ కాలేజీ,
రామ్‌నగర్ 'X' రోడ్, హైదరాబాద్.



'రాగాలాపన' లో నేటి ప్రజా జీవన స్థితి గతులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. సత్యాన్ని, వాస్తవాల్ని ప్రకటించడంలో శ్రీ రమేష్ గైక్వాడ్ 'రాగా' వెనుకాడడం లేదు. కావున సమాజానికి దోహద పడుతుందని పూర్తిగా విశ్వసిస్తు అభినందిస్తున్నాను.

సూర్యకాంత్ లోణ్‌కర్
మాజీ సైనికులు మరియు సంయుక్త కార్యదర్శి
స్వకుళ సాళి సమాజ్, హైదరాబాద్.

కృతజ్ఞతలు

★ రాగాలాపన కవితా సంపుటి వెలువడుటకు ప్రోత్సహించి సహకరించిన మిత్రులు శ్రీ వి. ప్రవీణ్ కుమార్ గారికి,

★ అభిప్రాయం వ్రాసి ఆశీర్వదించిన కవితా గురువులు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి గారికి,

★ అభిప్రాయం వ్రాసి ఆశీర్వదించిన అవధాన సహస్రఫణి బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణి శర్మ గారికి,

★ పీఠిక మానవతా జాతీయ వాదానికి స్వాగతం పల్కి ఆశీర్వదించిన డా॥ కసిరెడ్డి గారికి,

★ నా అభివృద్ధి కోరి ఆశీస్సులందించిన శ్రీ విఠల్‌రావు ఆర్య కార్యదర్శి ఆం.ప్ర. ఆర్యప్రతినిధి సభ మరియు ఆర్య జీవన్ సంపాదకులు శ్రీ ప్రీతం సింగ్ రిటైర్డ్ యస్. పి. మరియు కార్యదర్శి సిఖ్ ఎడ్యుకేషన్ సొసైటి,

★ శ్రీ ధర్మపాల్ నగరి మాజీ అధ్యక్షులు యస్. యస్.కె. సమాజ్ శ్రీ అమృత్ కుమార్ జైన్ సంఘ సేవకులు,

★ శ్రీ సూర్యకాంత్‌లోణ్‌కర్ సంయుక్త కార్యదర్శి స్వకుళసాళి సమాజ్, శ్రీ విఠల్‌రావు శింగాడే మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ గారికి,

★ మిత్రులు మరియు శ్రేయోభిలాషులు శ్రీ యస్. నర్సింగ్ రావు హింది లెక్చరర్. శ్రీ తారాశంకర్ కల్యాణ్‌కర్ ప్రిన్సిపాల్ శ్రీ బి. వెంకట రమణ, కామర్స్ లెక్చరర్, డా॥ మొహ్మాద్ అలి చైర్మన్ అండ్ కరస్పాండెంట్ సాధన పారా మెడికల్ వొకేషనల్ జూనియర్ కాలేజి, డా॥ చంద్రకాంత్‌రావు ప్రశాంతి డయాగ్నస్టిక్ సెంటర్ ఇ.యస్.ఐ. ఎదురుగా, శ్రీ రమేష్ నాయుడు సంఘ సేవకులు, శ్రీయస్. అశోక్‌యాదవ్ శ్రీ మొహ్మాద్ అన్వార్ కార్యదర్శి / ప్రిన్సిపాల్ యం.ఎ. ఐడియల్ హైస్కూల్ కిషన్ బాగ్, శ్రీమతి టి. న్‌మోహన్‌దేవి ప్రిన్సిపాల్ సెసెంట్ హైస్కూల్, జాలి హనుమాన్, శ్రీ హరిశ్చంద్రారెడ్డి మ్యాథ్స్ లెక్చరర్, శ్రీ సింగాపురం భజరంగరెడ్డి, నా తోటి కిషన్‌బాగ్‌లోని గురునానక్ జూనియర్ కాలేజి మిత్రులు శ్రీ యం. అనిల్‌కుమార్, అర్థశాస్త్ర అధ్యాపకులు శ్రీ షేక్‌చాంద్, శ్రీ జి. రుద్రప్ప లెక్కల అధ్యాపకులు, శ్రీ యం. శరత్‌చంద్ర (ఇంగ్లీషు అధ్యపకులు గారికి.

★ శ్రీ జయప్రకాశ్ మన్నె (జె.యస్.బి. ప్రింటర్స్) గారికి.

★ సహకరించిన సాహితీ బంధువులందరికి.

ఇందులో.....

మరో చరిత్ర వేదిక

మరో చరిత్ర వేదిక

నే వ్రాసిన రుధిర గీతిక

ఒక వైపు న్యాయ ధర్మాలు

నీతి నియమాలు నశిస్తూ,

మూగ ప్రాణులు అల్‌కబీర్‌కు బలవుతుంటే

ఇంకో వైపు దేశాన్ని 'గాట్' దోచుకుపోతుంటే

భరించ లేని భారతావని చూస్తూ

కన్నీరు కార్చే వేళ నే

వ్రాసిన రుధిర గీతిక

మరో చరిత్ర వేదిక

అవిశ్వాస నరుడి చేతుల్లో

యుగ-యుగాల స్నేహ శతాబ్దాలు

తరిగి-విరిగి పతనమై పోయి

మానవత్వము సమసి-మసియై

నామరూపాల సైతం మంట గలిపే వేళ

నిండు సంస్కృతిని దేశ చరిత్రను

సంరక్షించుటకై తరలిరండని

నే వ్రాసిన రుధిర గీతిక

మరో చరిత్ర వేదిక

మాతృ మూర్తి గర్భంలో

కత్తులు దూసి నెత్తురు పాలు చేసే

అక్రమ అఘాయిత్యాల అంతుతేలాలని

మోస దగాకోరుల చలామణి అంతమవ్వాలని

నిద్ర మబ్బులో యున్న సోదరులను

సహో దరులను మేల్కొలుపుటకై

నే వ్రాసిన రుధిర గీతిక

మరో చరిత్ర వేదిక

జగతికి

సామాన్య ప్రజల ప్రగతికి

నిండు జన చైతన్య

సౌందర్యలోక స్వప్నాలకు

క్రొత్త కాంతి రూపమివ్వాలని

నే వ్రాసిన రుధిర గీతిక

మరో చరిత్ర వేదిక

(ఆర్య జీవన్ పత్రికలో
1-16 జులై 1994 న ప్రచురించబడినది)

నిన్నటి కల

నిన్నటి కలలో నే
ప్రేమను పొందాను
అందని ఆకాశంలో
వెండి అంచు
వెలుగును చూచాను
సాగర తీరాన
సాగిపోయే కోకిల
గానం విన్నాను
ఆగని అలగా సాగి
హద్దులు దాటాను
నా మనసు పక్షియై
నిను గాలిస్తూ పయనించింది
ఓ ప్రేమ మనస్సు
అడ్డుపడి నా
గమ్యాన్ని చేర్చుటకు
ప్రయత్నించింది.

బాబూ! ఈలోకానికి రావద్దు

బాబూ !

ఎందుకలా అంత నిరాశగా చూస్తున్నావ్ !

నిను తెలియని నీ తొందర పాటును

నే అడ్డుపడి ఆపుతున్నా ఈ

లోకానికి రావద్దని ఈలోకంలో చేరొద్దని.

ఏముందని ఇచటికి వస్తున్నావ్

నువ్వు తలచినంత అందంగా లేదు ఈలోకం

నువ్వనుకోక ముందే ఇచటి ప్రేమ,

ఆప్యాయత, శాంతత, ప్రశాంతత

ఏనాడో అంతరించిపోయాయి. అది

తెలియక నువ్వు ఈ లోకానికి వస్తున్నావు

అందుకే నిను తెలియని నీ తొందర పాటును

నే అడ్డుపడి ఆపుతున్నా

ఈ లోకానికి రావద్దని ఈ లోకంలో చేరొద్దని.

ఇక్కడ అంధకారం నిగుడాంధకారం తప్ప

వెలుగు బాటలు కానరావు

ఇక్కడి చరిత్రంతా నెత్తుటి పుటలతో నిండియుంది

అందులో మేము రాలిపోతు కాలిపోతూ !

మా జీవితాలు చేజారి వాడిపోతుంటాయీ !!

అందుకే నిను తెలియని నీ తొందర పాటును

అడ్డుపడి నే ఆపుతున్నా

ఈ లోకానికి రావద్దని ఈ లోకంలో చేరొద్దని !!

నే చెప్పేదంతా రహస్యమైన నిజం ఇది నిజం !
ఏ రోడ్డు ప్రక్క నువ్వు పుట్టినా
ఆ ప్రక్కే ఉన్న మేడల నీడలు కూడా
నీకే మాత్రం దక్కవు బాబూ ! నీకే మాత్రం దక్కవు
ఇక నీ వెందుకు వస్తున్నట్లు ?
నీ మనస్సు చాలా సున్నితమైనది
నాకు తెలుసు అందుకే
నిను తెలియని నీ తొందర పాటును
అడ్డుపడి నే ఆపుతున్నా ఈ
లోకానికి రావద్దని ఈ లోకంలో చేరొద్దని
ఈర్ష్యా, ద్వేషం, మోసం, దగా
'లావా' లా పెల్లుబికి పేధిస్తుంటాయి,
వీటికి నువ్వు తట్టుకోలేవు నాకు తెలుసు
నువ్వు తాళలేవు ఇక్కడి తీరేవేరు బాబూ ! ఇక్కడి తీరేవేరు !!
నాకు తెలియదు నా పురుడికి ముందే
పుడమితల్లి సైతం ముసలిదైపోయిందని
అందుకే బాబూ ! నీకు తెలియని నీ తొందర పాటును
అడ్డుపడి నే ఆపుతున్నా ఈ లోకానికి
రావద్దని ఈ లోకంలో చేరొద్దని.
అసత్యం సత్యాన్ని కప్పివేసి వర్ధిల్లుతున్నది
సత్యం నిరాధారమైనది అసత్యపు నాలుకలు బుసకొడతాయి
అందుకే బాబూ ! నిను తెలియని నీతొందరపాటును
నే అడ్డుపడి ఆపుతున్నా
ఈ లోకానికి రావద్దని ఈలోకంలో చేరొద్దని.
న్యాయాన్ని ఓడించి అన్యాయం సాఫీగా సాగుచుండగా
న్యాయ దేవత కంటి చూపు తొలగిపోయింది

అన్యాయం చాలా బలమైనది దృఢమైనది
అస్త్రంలా దివ్యాస్త్రం లా రాణిస్తున్నది
నువ్వు ఓర్వలేవు బాబూ ! మధ్యలో వ్యర్థంగా చితికిపోతావు
అమానుషంగా నీ బ్రతుకు బలియైపోతుంది
అందుకే నిను తెలియని నీ తొందర పాటును
అడ్డుపడి నే ఆపుతున్న ఈ లోకానికి రావద్దని
ఈ లోకంలో చేరొద్దని.
నువ్వు తలచుకున్న నీతి నియమ ధర్మాలు
అవినీతికి, అధర్మానికి ఏనాడో తలవంచుకు పోయాయి
ఈ రాజ్యంలో నువ్వు బ్రతకలేవు బాబూ ! బ్రతక లేవు !!
ఇక్కడ ప్లేగు మశూచి, కలరా, పోలియోనే కాదు
భయంకర (HIV) ఏయిడ్స్ హెపటైటిస్ వ్యాధులకు గురియై
జీవన మరణాలు
అర్థమవ్వక సతమత మవుతున్నారు.
ఇక్కడి నింగి, నేల, గాలి నీకు సరిపడవు
అందుకే బాబూ ! నా కిష్టం లేక పోయిన మరీ బ్రతిమలాడి
నీకు తెలియని నీ తొందర పాటును నే
అడ్డుపడి ఆపుతున్నా ఈ లోకానికి రావద్దని
ఈ లోకంలో చేరొద్దని

నోట్:

పుట్టబోయే బిడ్డను ఈ లోకానికి రావద్దని సంబోధన. స్వేచ్ఛా స్వాతంత్రాలను కల్గిఉండాలనే అభిప్రాయం అందరికి ఉంటుంది. ఈ లోకానికి రావద్దని అనే అధికారం నాకేమాత్రం లేదు. నేను ఆశావాదినే అయినా ఇక్కడి పరిస్థితులను అవగాహనచేసుకున్న తర్వాత నా కిలా అనిపిస్తుంది. ఇక్కడి పరిస్థితులను మేము చక్కబెట్టుకున్న తర్వాత స్వాగతం పల్కుదాం లేదా బాబూ నువ్వొచ్చి ఈ సమస్యల్ని రూపుమాపు !

స్వాతంత్ర్యం

సరిగ్గా అర్ధరాత్రి

హర్షోల్లాసాలతో

విజయ దుందుభిలు

మ్రోగిన తొలిరాత్రి

స్వతంత్ర జీవధాత్రి

భారత నడిరోడ్డుపై

అర్ధరాత్రి ఆడది ఒంటరిగా నడవగల్గినప్పుడే

నిజమైన స్వాత్రంత్ర్యమని బాపూజీ వాక్యాలు

బాపూ ! నేడు

నువ్వు లేవు సరిపోయింది

ఇక్కడి చరిత్ర

నడవడి తీరు

నీవు కన్న కలలు అన్నీ తారుమారుగా

అగుపిస్తున్నాయి

స్వాతంత్ర్యానికి అర్థం మారి పోయింది

ప్రజాస్వామ్యానికి శీలం చేజారింది

గుండాయిజం, రౌడీయిజం

ఖూనీ దగాకోరు, అవకాశవాదుల రాజకీయం

ఆడది ఒంటరిగా నడిరాత్రి కాదు కదా

పట్టపగలు కూడా గడప దాటి

నడవలేని దుస్థితి,

నిండు జీవితం ఏ కామాంధులకో
బలై పోతుందో
ఏ కత్తులు కటార్లు నరికి వేస్తాయో !
వేచియున్న విషనాలుకలు
ఏ నిమిషాన బుసకొడతాయో
నారీ శీలం మానం మర్యాద
ఏ నడిరోడ్డుపై
ఏ క్షణాన పోతుందో
స్వాతంత్ర్యం పేరిట
నేడు సాగుతున్న అఘాయిత్యాలు
ప్రజాస్వామ్యం పేరిట
ప్రజావంచనాలు

నోట్

(**15**వ ఆగస్టు **1995** స్వాతంత్ర్యదినాన, హైదరాబాదు యూనివర్శిటీలో (Central University) యం.ఎస్.సి. చదువుచున్న అమ్మాయిపై జరిగిన అత్యాచార, బలాత్కార వార్త చదివి స్పందించి...)

నను ఆడుకోమంటారా హోలి

కుల మతాల - రక్తపాతాలు
ఖూనీ కోరుల - భ్రష్టాచారాలు
ఇకపై తొలిగిపోనున్నాయని
స్నేహ భావాలు చిగురిస్తాయని
సరదాగా నను ఆడుకోమంటారా హోలి !
హత్యా దోపిడి, మానభంగాలు
బాలల బానిసత్వం వారిపై దౌర్జన్యాలు
పూర్తిగా అంతమైపోతాయని
సంబరంగా నను ఆడుకోమంటారా హోలి !
నిజాయితిపై బుల్లెట్ల కాల్పులు
ఎన్నికల్లో బ్యాలెట్ల కొనుగోళ్ళు
అక్రమాలు వైదొలగుతాయని
అక్షరాల ప్రజాస్వామ్యం వర్ధిల్లునని
నిశ్చింతంగా నను ఆడుకోమంటారా హోలి !
నగరంలో పారామిల్టిరి దళాలు
భయంకర నిర్మానుష్య వీధులు
మృత్యు నీడలు వెంబడించవని
కర్ఫ్యూలు విధించబడవని
నిర్భయంగా నను ఆడుకోమంటారా హోలి !
మొన్నటి దాకా బోఫోర్స్ కాండంకు
నిన్నటి దాకా షేర్స్, చక్కెర కుంభకోణాలకు
నేడు జైన్ హవాలా, పశుదాణా కాండంకు
రాజకీయాలు రేపు మరీ దివాలా తీయవని
మైమరచి నను ఆడుకోమంటారా హోలి !
అసెంబ్లీ - పార్లమెంటులో రోజురోజు
రాజకీయ పక్షాల దూషిత విధానాలు
జాతీయ ప్రయోజనాల పునాదులకి
నవభారత నిర్మాణానికి కృషి చేస్తాయని
నమ్ముకుని నను ఆడుకోమంటారా హోలి !!

గుణ వికాసం

మానవ గుణ వికాసాలలో
మానవతా మహోన్నతమైన ఒక కళ
కళ్ళలో నీటిని తుడిచి
దారి చూపేదే సంస్కృతి
సమాజాభివృద్ధికే పట్టుకొమ్మ సంస్కృతి
కలలన్నీ కల్లలై
కన్నీరుగా మారి కారుతున్నప్పుడు
ఓదార్చేదే కవితా !
హింస - ప్రతి హింసలకు వ్యతిరేకంగా
నినాదించె వాడే అహింసావాది
మూఢా చారాలకు
అంధ విశ్వాసాలకు
దమన నీతులకు వ్యతిరేకంగా
ప్రచారం కొనసాగిస్తు
బ్రతుకు సాగదీసె వాడే
అభ్యుదయ వాది.

శ్రమజీవులు

ఎల్లప్పుడు వారిలో ప్రవహించేది చెమట బిందువులే
దాన్నే సహజ సుగంధమని
పరిగణించి ఆస్వాదిస్తారు
శ్రమ దానం మాత్రమే
వారు నేర్చిన విద్య
కష్టాల్నే సుఖాలుగా పరిగణించి
జీవితాలు కొనసాగించడం కళ్ళలో నిజాయితి,
మదిలో ఉదారభావం తప్ప
స్వర్గసీమ కలలెన్నడూ కనరు
పాపం ! వారు సామాన్యులు !
ఒక పూట తిండి గడిస్తే చాలు అదే వర ప్రసాదం!
పంచభక్ష పరమాన్నాలు కోర్కోరు
చిరిగి, అతుకులు పడిన పరిధానమే చాలు వారికి
తనువు దాచుకోడానికి,
మేడల ఆశలు తలంచరు
మేడల నిర్మాణమే వారిశ్రమ
స్వయంగా నివసించడానికి మాత్రం కాదు.

లోకం తీరు

లోకానిదేముంది
లోకం తీరేవేరు
ఏడ్చేవాడంటే ఇష్టం
గాలి పటాల
జీవితాల్ని
కోరుకుంటుంది
గాలి పటం
తెగిపోతే చాలు
తెగిపోయిన
గాలి పటాల్ని చూచి
మనసార నవ్వు కుంటుంది
మనిషి
ఓటమంటే చాలా ఇష్టం
ఓడిపోయిన
హృదయాలతో
చెలగాట మాడి
గాయం చేస్తుంది
సజీవంగా
దహించుకు పోతే
కరతాళ ధ్వనులతో
సంబరపడుతుంది
లోకం తీరేవేరు

నేటి భారతం

చూడమ్మ భారతి భారతం !
తగవులతో రగులుతున్న నేటి భారతం !!
కులం పేరుతో జరిగే కుతంత్రం !
మతం పేరుతో జరిగే మారణహోమం !!
మారి పోతున్నదమ్మ ఈతరం !
మరచి పోతున్నదమ్మ నవరతం !!
పాడలేక పోతున్నది వందేమాతరం ! వందేమాతరం !!
కార్గిల్ కాశ్మీరులో కల్లోలం కల్గిన
పంజాబులో రక్తాలే పారిన
అస్సాంలో అరాచకం చెలరేగిన
విశాలాంధ్రావని ఉప్పెనలో మునిగిన నిస్తబ్దంగా ఉంది
పదవులకై పాకులాడే బడారాజకీయ రాబందులను !
వేటాడాలని, ఎదురించాలని !! మరచింది యువతరం
ప్రజాస్వామ్యం ఈదేశం జీవనాడంటారు
ప్రజలను నిర్ధాక్షిణ్ణంగా పీక్కొని తింటున్నారు
ఇదేనమ్మ భారతి నేటి భారతం
తగవులతో రగులుతున్న ఈదేశం నాదేశం !

ఉత్తరాలను భద్రపరుచు !

దోస్త్ !
నిన్న రాత్రి పాత ఉత్తరాల్ని చూస్తుంటే
గతమంతా గేయంగా మారి,
ఈ కాగితాలపై జారింది
ఎన్నో జ్ఞాపకాలు !
మరెన్నో అనుభవాలు
మన మదుల ముంగిట్లలో
పక్షుల్లామారి ఆడుకుంటున్నాయి
నాస్మృతి పథం నుండి ఓ జ్ఞాపకం జారి
చివరకు ధూళిగా మారింది.
ధూళిగా మారిన ఆ జ్ఞాపకం కాస్త తెరగా మారి
మిగిలిన జ్ఞాపకాలపై కమ్ముకుంది
అందుకేనేమో ఉత్తరాలు వ్రాసే ముందు
మనముందు ఓ ప్రశ్న
"వ్రాయటానికేముంది" ?
క్షేమ సమాచారాలతో మొదలైన ఉత్తరాలు
గింజుకుంటు, పొక్కుంటు, చివరకు
బాధల వ్యాఖ్యాలతో సొమ్మసిల్లుతాయి
కొన ఊపిరితో నున్న ఉత్తరాలు,
మన కరస్పర్శలతో
కాస్తంత సేద తీరి, ఊరడిల్లుతాయి
ఊరడిల్లి తన కర్తవ్యాల్ని నిర్వహిస్తాయి
గత మంటే అభిమానమున్నా ఆరాధిస్తూ కూర్చోలేము కదా !
అందుకేనేమో

మన ఉత్తరాల్లో గతం గూర్చి చర్చే ఉండదుకదూ !
మన మాటల్లో దొర్లిన అనుభవాలు, జ్ఞాపకాలు
ఉత్తరాల్లో ఎందుకోస్థానం పొందవు
బహుశ భవిష్యత్తంటే మన కున్న మోజువల్ల కావచ్చు
లేదా గతమంటే ప్రేమున్న భయంవల్ల కావచ్చు
ఉత్తరాలు మన అస్తిత్వాలకు సంకేతాలు
అందుకే ఉత్తరాలను భద్రపరుచు నేస్తం !

నీకు తెలుసా ?

ఎన్ని సార్లు సుత్తి కొడితే
ఓ రాయి శిల్పం అవుతుందనీ !
ఎన్ని వర్ణాల కలయికతో
ప్రకృతి చిత్రం రూపొందుతుందనీ !
ఎన్ని మార్లు కంఠాన్ని సానపడితే
ఒక లయ శృతి ప్రసవిస్తుందనీ !
ఎన్ని సార్లు వేళ్ళుమారి మీటితే
ఒక నాద సంగీతం పుట్టుకొస్తుందనీ !
ఎన్ని చరణాల తప్పటడుగులను మార్చితే
ఒక నృత్యం ఆవిర్భవిస్తుందనీ !
ఎన్ని గునపాలు గుచ్చితే
గుండె కావ్యమై పారుతుందనీ !
మనిషి మనిషిగా బ్రతకడానికి
ఎన్ని మార్గాల్ని వెదకాల్సి ఉంటుందనీ !

రాగా లాపన - 1

పెదవుల్లో దాగిన నిజం
కళ్ళల్లో బహిర్గతమవుతుంది
కళ్ళు నిశ్శబ్దంగా మాట్లాడుతాయి
రహస్యం మనస్సు విప్పక పోయినా
ఊపిరితో బయటకు వస్తుంది సునాయసంగానే
ప్రతి క్షణం ఊపిరి మాట్లాడుతుంది
గతాన్ని వివరించలేని జీవిత గాథలను
మౌన రహదారులు వివరిస్తాయి
శాశ్వతంగానే మౌనంగా అవి మాట్లాడుతాయి
మిమ్మలను మరచి నే దూరమైన
మరవలేని మీ జ్ఞాపకాలు మాత్రం
ఎప్పుడూ వెంబడిస్తూ నను పలకరిస్తుంటాయి
జీవిత మార్గంలో సుఖ దుఃఖాలు సహజం
సుఖం చెప్పని చేదు నిజం దుఃఖం విప్పుతుంది
అందుకే జీవిత దృశ్యాలు సదా మాట్లాడుతాయి
తోడు నీడ లేని అంధకారంలో
సుఖ దుఃఖాల బేరీజులను లెక్కిస్తూ
క్రమం తప్పక రాత్రులు మాట్లాడుతాయి మౌనంగానే
పగటి వెలుగులో నే కన్పించకపోయిన
మీ మస్తిష్కంలో జ్ఞాపకాలు ఆటలాడుతాయి
సదా మీ మదుల్లో 'రాగా' లాపన చేస్తుంటాయి

నడుస్తూనే ఉన్నా

ఎన్ని యుగాలు తరిగిపోయిన
ఎన్ని కోరికలు ఆవిరయిపోయిన
జీవితంపై ఆశ తరగలేదు
నడచిన రహదారుల్లో
మళ్ళీ నే నడుస్తునే ఉన్నా
గడచిన ప్రతి క్షణాన్ని నిక్షిప్తపరుస్తూ

స్మృతులు

స్మృతులు మరీ నన్ను నిద్రతట్టి లేపుతాయి
నిను చేరుకోమని కలవర పరుస్తాయి
అక్షులు మీనాక్షులై కాంతులు విరజిల్లగా
విశ్వ మంతటిని నీలో చూడాలని
రాగాలై అనురాగాలై నిను అల్లుకోవాలని
స్మృతులు మరీ నన్ను నిద్ర తట్టి లేపుతాయి
ఆహా ! నా మనస్సు పక్షియై మరీ మరీ
నీ కడకు చేరాలని,
చేరి నీ పెదాలపై పాటలుగా మారాలని
ఆకాశ సంధ్యా గమనాన ఆకాశ పందిరిలో విహరించాలని
స్మృతులు మరీ నన్ను నిద్రతట్టి లేపుతాయి

నా గీతం !

కావాలి నాగీతం
అవినీతిని, అన్యాయాన్ని
అక్రమాలను దౌర్జన్యాలను
అరికట్టే అస్త్రం ! దివ్యాస్త్రం !!
తేవాలి నాగీతం
యువ తరాన్ని మేల్కొలిపి
వారి గుండెల్లో నరనరాల్లో
చైతన్యం, స్ఫూర్తి, త్యాగనిరతి !
సదా సద్భావ సేవాపరాయణత !!
వెలిగాలి నాగీతం
సతమతమవుతున్న
బానిసలై బలవుతున్న
నిరాశావాదుల మనస్సులో
ఉషోదయ ఆశా కిరణాలై !
ప్రవహించాలి నాగీతం
వర్గరహిత ప్రేమాప్యాయత
ధర్మ చరిత న్యాయ భరిత
అనుభవా చరణాన్ని
అక్షరాల సత్య నిరూపణకై
మారాలి నా గీతం
నినాదమ్మై సమసమాజ
విప్లవ దోహదం, ప్రజా సంక్షేమం,
జాతీయ వైభవం
మరో స్వాతంత్ర్య పోరాటం
నవభారత నిర్మాణం
నాగీతం !

ఎవరు నువ్వు

అందమా మకరందమా

ఆనందానికి ప్రతి రూపమా

కనుల కింపగు సుందరివా !

మదిలోనే మనసిచ్చే మమతవా !

భువిని చేరి చెంతకు చేరని

మాయవా !

హాయిని గొల్పే

మందార మాలవా !

నడకే నడవని నటనే మారని

ఎదుటే నిలిచిన రాతి బొమ్మవా !

చూచుట కింపుగ

మనసుకు సొంపుగ

మదిలో కొలిచిన

నాట్య మయూరివా !

ఆశగ మిగిలిన

మిలమిల మెరిసిన

గగన తారవా !

జననమే లేని

మరణమే రాని

అజరామరనివా !

బాపూ మళ్ళీ జన్మించి

జాతి కుల మత దురహంకారాలు
నేడు మనలో సాగే మారణహోమాలు
దేశం మంటల్లో, బుల్లెట్ల వర్షంలో కాలుతూ !
నేడు బాంబు ప్రేలుళ్ళలో సగటు వాడు
తగుల బడి పోతుంటే
రక్షించాలి బాపూ నువ్వు మళ్ళీ జన్మించి
పేదవాడి విశాద గీతాలు
శిలలుసైతం విలపిస్తున్నాయి
మహిళలపై అత్యాచారాలు బలత్కారాలు చెలరేగిపోతున్న
మానవ హక్కుల సంఘాలు సైతం చేతులు ముడుచుకొని
మౌనంగా చోద్యం చూస్తునే ఉన్నాయి
మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలి
బాపూ ! నువ్వు మళ్ళీ జన్మించి
ఒక వైపు ఆపదలో ఉన్న ధర్మాన్ని కాపాడమని
మందిరంలో పూజారి, మజీద్‌లో ముల్లా,
చర్చిలో ఫాదరి మరోవైపు
మనుగడ కోసం అర్థాన్ని ప్రాధాన్యత నిస్తూ
దౌర్జన్య కాండ సాగిస్తున్న పెట్టుబడి దారులు
అటు సమసమాజ స్థాపన కొరకు నడుంబిగించి
అంతః కలహాలకు గురియై మనుగడ కోలిపోతున్న నక్సలిజం
ఇటు రాజకీయ రాబందుల దాడికి గురియై
విలవిల లాడుతున్న సగటు వాడి కేకలు వింటూ
దైన్యంగా నిల్చున్న మాకు దారి చూపాలి

బాపూ ! నువ్వు మళ్ళీ జన్మించి
అర్ధరాత్రి ఆడది ఒంటరిగా నడి రోడ్డుపై నడిచేలా
జన స్వాతంత్ర్యం నిరూపించాలి.
మరో రామరాజ్యపు పునాది వేసి మమ్ములను కాపాడాలి
మరో ప్రపంచ సృష్టికర్తగా కలకాలం నిల్చిపోవాలి
బాపూ ! నువ్వు మళ్ళీ జన్మించి!

హృదయమా !

గాలిలో సుడి గాలివై
వీచకే హృదయమా !
ఎండలో మాడు టెండవై
విరియకే హృదయమా!

వానలో జడివానవై
అలలో ఉప్పెనవై
చెలరేగకే హృదయమా !

రాత్రుల్లో కరాళ రాత్రివై
నను దరి చేరకే హృదయమా !

కలల్లో కలతలు రేపి
నను అణచకే హృదయమా !

కాలంతో కలికాలమై
నను కాటేయ్యకే హృదయమా !

మువ్వ

మురళి మ్రోగింది మృదు మధురంగా
కోయిల కొమ్మపై కూర్చొని
చిగురాకులు తింటూ
వసంతానికి స్వాగతం పల్కింది
నెమలి తన నాట్యంపై
గర్విస్తూ నివ్వెర పోయింది
రంగులన్నీ తమలో
నవ చైతన్యం వస్తుందని పరవశించాయి
మువ్వ కదిలినందుకేగా
మురళి మ్రోగింది తియ్యగా
కోయిల వసంతానికి స్వాగతం పల్కింది
మయూరి నివ్వెర పోయింది
రంగులు పరవశించాయి.

నిశబ్ద నిశిలో
గమ్యం కానరాక
సాగుతున్న నాకు
ఘల్లు ఘల్లుమని
ఆహ్వానించి నా మువ్వ
నాలో
నవ చైతన్యం నింపలేదా
నవలోకానికి నాంది పల్కమని
అభ్యర్థించలేదా !

మూసీ నది !

మూసీ మన శరీరాల్లో చేరింది
శోణితంలా మారి ప్రవహిస్తునే ఉంది

చాదర్‌ఘాట్ వంతెనపై నిల్చి, మూసీ అందాల్ని చూడమంటే
ఫక్కుమని నవ్వుతున్న గుంపుకు తెలియదు ఓ నిజం
మనలో ప్రవహిస్తున్నది మూసీయేనని
మూసీ దుర్గంధం ముక్కు బద్దలు చేస్తుంటే,
ముక్కుమూసుకుని 'హమ్మయ్య'
అనుకున్న సమూహాలకు తెలియదు
మన నిశ్వాస - ఉచ్ఛ్వాసల్లో ఉండేది ఈ మూసీ గంధమేనని.

మూసీ మురికిని ఎంతగా చీదరించు కుంటున్నారో
వారే నిజంగా
ఆ హైదరాబాదీయులే అంతగా ఆరాధిస్తున్నారు
ఎందుకంటే
మనం మూసీని మురికిగానే ఉంచుతాం తప్ప దాన్ని శుభ్ర పరచం
మూసీ మురికి ఇప్పుడు మన అస్తిత్వంలా మారింది.

వేదన విశ్వరూపం

వేదన !
నీ వికార రూపం నుండి
తప్పు కోవాలని తలచాను
తీవ్ర ఆక్రమణ చే
నీ అస్థిత్వాన్ని నీ పునాదుల్ని
రూపు మాపాలని అనుకున్నాను
కాని,
నీ విశ్వరూపం చూచి
భయపడిపోయాను
ఆశ్చర్యంగా ఉంది
ఎవరినైతే నే రక్షించదలచానో
వారి అస్థిత్వం
వేదన అనే నీ పుడమిపై నిల్చున్నది.
ఒకవేళ నువ్వు పుడమి నుంచి అదృశ్యమైతే
సుఖపు అస్థిత్వం విలువ మిగులుతుందా !
ఆహా! వేదనా! నువ్వు సుఖానికి శ్వాసయై
అలంకారమై విరాజిల్లుతున్నావు
ఎంత అద్భుతం! ఎంత ఆశ్చర్యం!
సుఖం, వేదన ఒళ్ళో విశ్రమిస్తున్నది
తరుచుగా, మన దరి చేరుతూ ఉంటుంది
సుఖ అస్థిత్వమే దుఃఖం
మాణిక్యాలతో
ఆభూషణాలతో
సుఖాన్ని మన దరి చేర్చేది దుఃఖమే!

అందుకే ప్రతి క్షణం సుఖ దుఃఖ
సంయోగం 'రాగా' సదృశ్య
ఆగమనం

ఆత్మ !

ఆ చేతులన్నీ బంధించబడ్డ చేతులే
ఎటు చూచిన చట్టపు పుటల్లోంచి
ఊడి పడిన మానవత్వమే !
వారి అవ్యక్తమైన వేదన నాకు తెలుసు
వారి ఆర్తనాదాలు వినబడుతునే ఉన్నాయి అయినా !
నోరు విప్పజాలదు అడుగు ముందుకు వేయజాలదు
నిజమే !
ఇక్కడి ప్రజానీకమంతా
నిర్ధాక్షిణ్యంగా దుశ్శాసనుల చేతుల్లో
సతమతమవుతూ ఉంటుంది
సగటు మనిషికి జరిగిన అవమానం, అన్యాయం
అర్థం చేసుకున్నా
నోరు విప్పజాలదు అడుగు ముందు వేయ జాలదు
అమాయక జీవితాలు కామాంధుల పాలైనా,
ద్రోహాలకు గురైన చెప్పుకోలేని విషాదం మనసులో మిగిలినా
సత్యం, ధర్మం, సంకెళ్ళల్లో బంధియై
దీనంగా తపిస్తున్నాయి
అయినా ఆ ఆవేదనను
ఆత్మ సహించమంటుంది
నోరు విప్ప మనదు
అడుగు ముందుకు వేయ మనదు
ఎందుకంటే !
నిజాలు జీర్ణించుకోలేని అవకాశవాదులు
అధికారమనే నాల్గు గోడల్లో చితికేస్తారు
కాబట్టి !

సురాజ్య ధరణి

వేదాలు వెలసిన పుడమిరా మాది
క్షీర సముద్రాల విలసిల్లే ధరణిరా మాది
సంఘ సంస్కర్తల ఐక్యవేదిక గౌరవదేశమిదే
తర తరాలుగా కీర్తినొందిన భారత జాతి మనదేరా !

మృత్యునీడల్లో బ్రతికే బ్రతుకు కాదురా మాది
మహమ్మారి మద్య నిషేధంబు ధ్యేయంబు మాది
స్వరాజ్యమున్నా కడగండ్లరాజ్యం కారాదు మాది
కాల రాత్రులను తరిమే సురాజ్యం రావాలి తేవాలి

గంజి నీళ్ళకు కరువైన సంక్షేమ పథకాలు మావి
బడుగు వర్గాల జీవితాలు బలి తీసే బాటలు ఇవీ
మత్తుకు బానిసలై చిత్తుగా మారే ఆనిండు కాపురాలు
కుతంత్రాల చిక్కుల్లోచితికే పరిస్థితులు ఇంకెన్నాళ్ళు ?

దైతేయ సేనతో ఇన్నాళ్ళు నలిగిన ఇకనైనా మారిపో
నిజ జీవితాన్ని తెలుసుకో ప్రగతి శ్రేణిలో కలిసిపో
సమసమాజ నవ్యజగతి నిర్మాణ కర్తగా కలకాలం నిల్చిపో
కదం కదం త్రొక్కుతూ గళం గళం విప్పుతూ ముందుకు సాగిపో

మన చరిత్రలో లేదురా వ్యసన బానిస ప్రభుత్వాలకు చోటు
ఇకనైనా తెలుసుకో సాగించు ఎడతెగని, మా ఉద్యమాల జోరు
రేయింబవళ్ళు ఒకటిగా చేసి క్రమ్మిన అంధకారాన్ని తొలగిద్దాం
భారత సురాజ్యంకై చివరికి మాప్రాణాలైనా అర్పిద్దాం

(ఆర్య జీవన్ ద్విభాషా పక్షపత్రిక
1-16 అక్టోబరు **1994**న ప్రచురితం)

ఈరోజు

నిజంగానే ఈ రోజు
హిమాలయాలు సైతం కరిగి పోతున్నాయి
సప్త సముద్రాలు
ఇంకి పోతున్నాయి
కంపన ప్రకంపనాలచే
అవని బ్రద్దలవుతున్నది
వాయు మండలం స్తంభించి
ఆకాశం నిర్లిప్తమవుతున్నది
దిక్కులు తోచక
నలు దిక్కులు పిక్కటిల్లు తున్నాయి
ఉదయించుటకు మనసొప్పని
సూర్యుడు అగ్ని కిరణాల్ని
వెదజల్లి తనలో తాను
మండు చున్నాడు
తెలియని
గాఢాంధకారంలో రేయి మునిగి విలపిస్తున్నది
మానవాళి ఈ విపత్కర పరిస్థితుల్ని
ఎలా ఎదుర్కోవాలో
అర్థం కాక విషాద వదనాలతో నిలచింది
హృదయమనే మైక్రోస్కోప్‌తో పరిక్షిస్తే
ప్రకృతి యెడల మేం చేస్తున్న
ద్రోహం విపరీతమైనదని
నా కీరోజే తెలిసింది

నే నెరగను

విడిపోయిన క్షణాలే గుర్తుకొస్తున్నాయి మళ్ళీ మళ్ళీ
తీరాలు వెనక్కైపోయినట్లు మనసు ఆవేదన !
గుండె క్రింద దాగిన రహస్యం కలవర పెడుతుంది
పెదవి విప్పి ఏదో చెప్పమని,
కదలికలు కల్గించిన మెదడుకు
ఊపిరి పోసిన కాగితాలకు
ప్రేరణ కల్పించిన వారినెలా మరచెదనని ?
అప్పుడప్పుడు ఆలోచనలు
అగ్ని పర్వతాల్లా బ్రద్దలయి
నను ప్రశ్నిస్తాయి నీ వెవరివని ?
సాహసం కోల్పోయిన పిరికి వాడిగా
బదులు పల్కలేక నాలో నేను నవ్వుకుంటాను,
నా హృదయ శిలపై ఉలితో చెక్కిన నీ రూపం
నాలో చెదిరిపోనేలేదు నిను ఎలా మరిచెదనని !
కలిసిన చేతులు చేసిన వాగ్దానాలు
చీకటి అగాధంలో గురుతులు తేలని జీవిత నౌక
ఒడ్డుకు చేరనే లేదు
మాటలు మధుర పాటలు
స్మృతి పటలంలో మేల్కొనే ఉన్నాయి
అవి తొలగిన నాడే నిను మరచేది !
ఆ దృశ్యాలన్నీ సురక్షితంగా బ్రతికే ఉన్నాయి
మన మిద్దరం మాట్లాడుతున్నప్పుడు
పువ్వులు ఎంతగా తొంగి చూశాయో
కోయిల ఎన్ని గంతులేస్తూ పాడిందో
ఆకాశం ఎంతగా మురిసిందో
కాని ఇప్పుడు గాలిలో చలనం లేదు

ఎటు చూచినా నిశ్శబ్దమే
నాతో మాటాడు వారే లేరు
దిక్కుతోచని నా మదిలో స్మృతులే వెంబడిస్తున్నాయి
శోకపు లోకంలో నేనే ఒంటరి వాణ్ణి
చేజారి పోయిన ఆ క్షణం కొరకు
చెదిరిపోయిన రుధిరాక్షరాల కొరకు
ఊపిరితో చేసిన సంతకం కొరకు
సంకేతం తెలియని జాడ కొరకు
శోకాజాలంలో గ్రుచ్చుకున్న ఆత్మ అగాధం కొరకు
నడిచి మరచిన బాటల కొరకు
బ్రతుకు సౌరంగంలో అన్వేశిస్తూనే ఉన్నా !
నా మెదడు కళ్ళలో ఏవో కలలు
తళుక్కున మెరిసి ఆ క్షణమే ఆవిరైపోతాయి
ఎండమావులని తెలియక
సెలయేళ్ళని పరుగెడు తుంటాను. నాకు తెలియదు
వాడిన పువ్వుల్లో చిరునవ్వులు,
మొగ్గల్లో నిరాశలు ముళ్ళల్లో ప్రేమవసిస్తుందని
ప్రేమానుభూతుల్లో, ఆలోచనాల్లో లోకం సజీవంగా
దహించుకు పోతుందని
నే ఊహించనే లేదు
కోరికలు ఇంత స్వేచ్ఛగా పొగ గొట్టంలోకి
బొగ్గు కుంపటి మంటల్లోకి దహించుకు పోతాయని
ఎన్నడూ కని విని ఎరుగని భయంతో
అరుస్తూనే ఉన్నా అయినా !
ఒక తరంగం కదలదు
ఒక కాంతి కిరణం వెలగదు
కరుణా వర్షాలసలే కురియవు
ఆరని మంటల పాటే వింటుంటా
ఆవేదన మంటల ఆటే కంటుంటా

వరకట్నం

నిజంగానే ఈలోకం ఆడపిల్ల పుడితే చింతిస్తుంది
మగ బిడ్డ పుడితే హర్షిస్తుంది
ఎందుకో ఇచట శిశు జననంపై హర్షశోకాలు
ఆడబిడ్డ జన్మనిచ్చిన సగటు మనషుల్ని
వరకట్నం భయంలో ముంచేస్తుంది
వరుడి హోదాకు తగ్గట్టు
వరకట్నం ఇవ్వాల్సిందని.
వరకట్నపు కిరీటాన్ని ధరించి
నడిబజారులో వేలం పాటకై
ఎదురు చూపులు
వరకట్నం! వరకట్నం !
వరుని జీవితం కట్నానికే అంకితం
అన్నట్లు! కట్నానికై
సంజాయిషీ
వాళ్ళు పెద్ద సదువు సదవినోళ్ళు
డిగ్రీ డిగ్రీకి రేటు పేరు అపై డిమాండ్లు కోకొల్లులు
ఉష్ !
వారు చదువుకున్న వాళ్ళు, చదువు కొన్న వాళ్ళు
వారు వరకట్న పుత్రులు
వరకట్నంఇచ్చుకోలేని
ఓ తండ్రి బాధను వినిపించుకోరు
ఆత్మఘోష, వినిపించుకునే
జాలి గుండె ఎక్కడిది ?
నిలువెల్లా విషమే !
వరకట్నం ఇవ్వకపోతే
ఏ నిమిషాన బుసకొడతారో
వారికే తెలియదు.

సాహసం

నిజంగానే నేను శాశ్వతంగా
సాహసం కోల్పోయిన వ్యక్తిని !
జీవితాంతం నిను నా కనురెప్పలలో
దాచుకునే సాహసం నాలో ఎక్కడిదని !
తరచుగా నీ కళ్ళలో ప్రవహించే
కన్నీళ్ళను ఆపుటకు నాకళ్ళకు
రుధిర వర్షం కురిపించే సాహసం ఎక్కడిదని !
నీ సుఖ సంతోషాలకై
దివి, భువిల నుండి వసంత గీతికలు
వినిపించే సాహసం నాలో ఎక్కడిదని !
చిరునవ్వుల చిరునామా వెదికి వెదికి
నీ మృదు అధరాలకు అంకితం చేసే
సాహసం నాలో ఎక్కడిది !
నీ దరి చేరుటకు దారినిండా
దాగియున్న ముళ్ళను అడ్డు తొలగించే
సాహసం నాలో ఎక్కడిదని !
తూర్పు పడమరలు కలవని
నింగి నేల కందని నీలో కల్గే
ప్రతి కోరికను తీర్చే సాహసం నాలో ఎక్కడిది
ఇలా ఎన్నో ఎన్నెన్నో
బదులు పల్కని ప్రశ్నలే
ఇక మిగిలిందేమిటి
చితికి ఓడిపోయిన
ఈ హృదయాంతరంలో
గతం మరవనివ్వని
స్మృతుల సాహసం తప్ప

కలియుగ పురుషులు

ఎండలకు మండుచున్న బండలు
"వీళ్ళే కలియుగ పురుషులని"
నవ్వుకున్నాయి నిన్ను నన్ను చూచి
మే చూపే జాలి, కనికరము కసిగా,
రక్కసిగా అగుపించి నవ్వుకున్నాయి
కారుచున్న కన్నీళ్ళను చూస్తూ
కాలుతున్న గుండెలు రగులుతుంటే
ఓదార్చక !
నిర్దయ హృదయులై నిలచిన
ఈ కలియుగ మహాపురుషులని
పక్కున నవ్వుకున్నాయి.
క్రుంగిపోతున్న స్వాతంత్ర్యం మరి
దేశం 'డంకెల్' వశం అవుతుంటే
కాపాడి క్రొత్త కాంతిచ్చే రణరంగుడేడని
జాలిగా నవ్వుకున్నాయి
మేము చూపే దయా దాక్షిణ్యాలు
కరుణ మే చేసే కలం వ్రాతలు
కావ్యాలకే పరిమితమైనవని
వ్యంగ్యంగా నవ్వుకున్నాయి
కలుగుచున్న యిక్కట్లకు
క్రమ్ముకున్న చీకట్లకు
క్రక్కుచున్న విషాదపు
గేయాలు పనికిరానివని
వింతగా నవ్వుకున్నాయి
లే లెమ్మ సోదరా !
జన చైతన్యం సృష్టించు

అని జాగృత పరిచే ఆ బండలు
కదం త్రొక్కి గళం విప్పి
నడుం కట్టి ధ్వజంబెత్తి
వినిపించు నీ శంఖారావం
చూయించు నీ విశ్వరూపం
మ్రోగించు నీ విజయభేరి అని
మమ్ములను మేలుకొల్పే ఆ బండలూ !
బండలు కావవి, గళం విప్పబోతున్న
కర్షకుల అంతరాత్మలు !

(ఆర్యజీవన్ పక్ష పత్రికలో
1 మార్చి 1994 ప్రచురించబడినది)

పల్కే దేమిటి ?

చెదిరిన గుండెలు
పల్కేదేమిటి ?
విరహ వేదనలు
ఆర్త నాదాలు !
తెగిన వీణ తీగెలు
పాడే దేమిటి ?
భగ్నరాగం
విరహగీతం !
కన్నీళ్ళ కన్నులు
కాంచే దేమిటి ?
చెదిరిన కల
కదిలిన కాలం !

ఒక్కసారి !

ఒక్కసారి ! ఒక్కసారి !
నా హృదయాంతరాన్ని
అర్థం చేసుకునే వారిని
చూడాలని ఉంది
ఒక్కసారి కల్మషం లేని
సహృదయ ప్రేమతో కలవాలని ఉంది
ఆ స్వచ్ఛమైన మనసు కోసం
స్వేచ్ఛా భరిత ఆ క్షణం కోసం
ఈ ప్రపంచ మంతా వెదుకుతున్నాను
నదీ తీరాల్లో
తరంగాల్లో ఆరూపం కోసమే
ప్రవహిస్తుంటాను
చెట్టు కొమ్మలపై వీచే పవనాలతో
కబురు పంపుతుంటాను
మబ్బులు క్రమ్మే ఆకాశాన్ని
వచ్చిపోయే నిశినంతా ప్రశ్నిస్తునే ఉంటాను
నోరులేని ఆ శిలా జవరాళ్ళ
గుండెలను సైతం మీటి అడుగుతుంటాను
పాపం!
కొన్ని జాలిగా కన్నీరు కారుస్తుంటాయి
మరికొన్ని మౌనంగానే నిల్చుంటాయి
బహుషా అవి నాలాగే వెతికి కాల గర్భంలో
కలిసినవిగా కన్పిస్తున్నాయి
పాటల్లో, సాధారణ మాటల్లో, కవితా గానంలో
వినిపిస్తునే ఉంటా నేను సదా వెదుకుతునే ఉంటా
వీధి కంతా తెలుసు నా ప్రకటన
అయినా

ఒక్కరు బదులు పల్కరు
అంతా నిశ్శబ్దమే
నాకు తెలియదు
అది నాపై జాలియో ! కక్షయో !
మౌనంగా చూస్తుంటారు
నాకు భయం, నిజంగానే భయం !
అప్పుడప్పుడు రేయిని ఛేదించుకుని
ఒక కిరణం ఉదయించినట్లు
నా గుండె కడకు ఎవరో
చేరినట్లనిపిస్తుంటుంది
అదియే నా స్వప్న రూపం
అదియే ఓ విశాల స్వరూపం
నా హృదయాంతరాన్ని
అర్థం చేసుకునే వారని తలుచు కుంటుంటాను
తలచినంతనే పలురేట్లు మురిసి పోతుంటాను
నన్ను నేను మైమరచి పోతుంటాను !
హఠాత్తుగా
తుఫాను చెలరేగి అంతరాత్మలో
మబ్బులు క్రమ్మినట్లు చీకటియే అగుపిస్తుంది
తీరా చూస్తే !
నను కోరుకునే ప్రతి ఒక్కరు
వాస్తవం కాదని
వారే నిరూపించు కుంటారు
అదంతా ఒక నటనయని తేల్చేస్తారు
నాగుండెను
అమాంతంగా పేల్చేస్తారు.

ఇలా, హేమంత శిథిల పత్రాల్లో
కలిసి నా అంతరాత్మ
దాహం తీరని తాపంలో తపిస్తుంటుంది
నాకు తెలియదు ఈ ప్రపంచం ఇంత
దారుణమైనదని నిర్దాక్షిణ్యమైనదనినూ
అయినా !
గుండెలో మిగిలిన
ఓ చిటికెడాశ నమ్మకం
నను బ్రతుక మంటుంది
బ్రతికి ఇంకొంత వెతకమంటుంది
నా హృదయాంతరాన్ని
అర్ధం చేసుకునే వారిని చూడమంటుంది
ఒక్కసారైన కల్మషం లేని సహృదయ ప్రేమనిచ్చే
వారిని కలువ మంటుంది.

నేస్తానికి వీడ్కోలు !

దోస్త్ !
నీ వెళ్ళిపోతున్నావ్ !
గుండెను చీల్చి, భారంగా వెళ్ళుతున్నావ్ !
కారుతున్న కన్నీళ్ళు
గుండె మంటను మరింతగా మండిస్తుంటే
మస్తిష్కంలో జ్ఞాపకాలను
భద్రపరచమంటు వెళ్ళిపోతున్నావ్ !
రగిలే రహదారుల్లో, నడిచినప్పుడు, నీ తోడుతో
ఆ దారులు చల్లగానే అగుపించాయి.
ఎప్పుడైన మదేడుస్తుంటే
నీ వోదార్చే వాడివి
అప్పుడప్పుడు మనం దెబ్బలాడుకున్న,
నేనలిగిన, నీవు నవ్వుకునే వాడివి.
అపరిచితులతో మాటాడుతున్న
ఆ కాస్తంత ఎడబాటు సైతం
మనస్సును మాడ్చేస్తున్న
మళ్ళీ మనం జతగా ఉంటామన్న ఆశ ఉండేది.
దోస్త్ !
నీ గమ్యానికై నీ పయనం అనివార్యమని తెలుసు
ఈ వీడ్కోలు రాక తప్పదని తెలుసు
ఈ గుండెను రెండుగా కోస్తున్న అశ్రువులను
ఆపాలని తెలుసు ఈ జారే అశ్రువులతో పాటే నీ స్మృతులు
ఆవిరౌతాయని భయం !
మనం కూర్చున్న స్థలాలు, మాట్లాడుకున్న సంజలు,
నడచిన దారులు, అన్ని స్మృతి చిత్రంలో
సజీవంగానే ఉంటాయి
సమూహంలో ఒకడిగా మారి

యాంత్రిక జీవితం గడుపుతున్న
అనుక్షణం నీతోడు గుర్తుకొస్తుంది.
ఎందరిలో నున్న నన్ను నీ జ్ఞాపక వీచికం స్పర్శించి వెళ్ళుతుంది.
అర్ధరాత్రి గాఢ నిద్రలో నుండి నను లేపి
నీ జ్ఞాపకం అల్లరిగా నవ్వుతుంది.
దోస్త్ !
ఎంత ఓదార్చిన
నామది నా మాట విననంటోంది.
నీ జ్ఞాపకాలు నను పిచ్చివానిగా
మారుస్తాయో మోనని భయంగా ఉంది దోస్త్ !
దోస్త్ !
ఎప్పుడైన నా జ్ఞాపకం నిను స్పర్శిస్తే
ఆక్షణాన్ని నీవు వరిస్తావా ?
నీ నయనాలు నాకై ఆత్రంగా
రహదారులలో వెదుకుతాయా ?
నీ చేతులు కలాన్ని వెదికి
మస్తిష్కానికి ఆజ్ఞలు పంపి,
మదిని శాసించి,
భావాలను కాగితంపై చెక్కుతాయా !
నీ వీడ్కోలుతో ఖాళీ అయిన ఈగది నను భయపెడుతుంది,
తన నిశ్శబ్దంతో నను బాధించి మింగేస్తుందేమో !
నేస్తమా ! నిలిచిపోరాదా !
ఈ వేదన నుండి విముక్తి కల్గించటానికి ! వద్దు దోస్త్, వద్దు !
నాకై ఆగి, నీ ప్రగతిని త్యజించొద్దు.
దోస్త్ !
వీడ్కోలు ! తాత్కాలికంగా మనం విడిపోయిన
ఉత్తరాల ద్వారా మళ్ళీ కలుసుకుంటునే ఉంటాం ?
దోస్త్ !

అందమైన స్మృతులు

మామూలుగానే మండే
ఈ నగర దారుల్లో, వీధుల్లో
నడుస్తుంటే,
మండే పర్వతాలు గుర్తుకొచ్చాయి
ఎన్నోస్మృతులు శాశ్వతంగా గుర్తుంటాయని ఆశించి,
మదిలో నిక్షిప్త పరిస్తే
అందులో కొన్ని ఆవిరయ్యాయి
కొన్ని శిథిలాలైయ్యాయి
మరికొన్ని రంగు వెలిశాయి
నను మురిపించి, మరిపించిన
ఆ స్మృతులు మళ్ళీ వర్షిస్తాయా !
ముఖంపై పొగ వదులుతూ వెళ్ళుతున్న వాహనాలు,
మండే ఎండలలో పరుగెత్తున్న జనాలు,
నిర్వికారంగా నిల్చిన భవనాలు,
పొడవుగా సాగి,
కొండ చిలువలా బద్దకంగా పడిఉన్న తారు రోడ్డు,
ఇవన్నీ చూస్తుంటే మండె రాళ్ళు గుర్తుకొచ్చాయి
ఉండుండి కమ్ముకునే మేఘాలు
ఊరించి ఊరించి, కురువకనే
సాగిపోతుంటే, మళ్ళీ ఆగి
నాలుగు చినుకులు కురిపించి
ముందుకు సాగుతుంటే
అందమైన స్మృతులు గుర్తుకొచ్చాయి.

పక్షులు

అవి ఏమి అనవు
కలహాలు చేయవు
మనిషి దైనిక చర్యలో
అడ్డు రావు
ఆస్తి అంతస్తుల
వాటాను పంచుకోవు
రోడ్లమీద సంచరించవు
భూమ్మీద నిద్రించవు
ఎవ్వరిని కష్టపెట్టవు
తమ గూళ్ళను
స్వయంగా నిర్మించుకుంటాయి
ఆకాశానికి రెక్కలు చాచి పయనిస్తాయి
భూగోళమంతా విహరిస్తాయి
అవి మనిషి దగ్గరకు రావు
ముక్కువున్నా ఎప్పుడు పొడవవు
మనిషిని చూచి ఈర్ష్య పడవు
ఆకలితో అలసినా
మనషుల
వంట గదుల్లోను చేరవు
వాటి తీరే వేరు
కష్ట సుఖాలన్నీ
స్వయంగానే
భరిస్తాయి
చరిత్ర కందని
ఓ మూగ భాషను
సహిస్తాయి
అవియే పక్షులు

నా మాతృ భూమి !

ఆది నుండి నా దేశం స్వర్ణ భూమిరా
త్యాగ మూర్తులను కన్న భూమిరా
మువ్వన్నెల జెండ నింగిలో రెపరెపలాడుతుంటే
సూర్య చంద్ర తారలెంతగా మెరిశాయో
నభమెంతగా మురిసిందో !
విదేశీయులు సైతం కోరుకున్న నా దేశం స్వర్గభూమిరా
స్వర్గం కంటే మిన్న అది నా మాతృభూమిరా
క్రాంతి గీతాలను విశ్వమంత పాడేలా చేసిన
క్రాంతి వీరులను గన్నదేశం !
నలు దిశలలో క్రాంతితో పాటు శాంతిని ప్రసరింపచేసిన
శౌర్యులను గన్న దేశం !
అన్ని సంస్కృతులకు స్వాగతం పల్కిన మహోన్నతదేశం
మహా సముద్రాల కలయికల సాక్షిగా
భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపించిన దేశం !
వేదాలు వెలిసిన భూమిరా! కర్మను చాటిన ధరణిరా !!
న్యాయ, ధర్మ సత్యాలకై ప్రాణాలొడ్డిన త్యాగధనుల భూమిరా!
భిన్నత్వంలో ఏకత్వం చాటి చెప్పిన భారతీయ తత్త్వం మనదిరా !!

సరిహద్దు పిలుపు

రా రమ్ము సోదరా! మూడు యుద్ధాల
పగలు, ప్రతీకారాలు మరచి
శాంతి స్నేహాల్ని వెలిగిద్దాం
క్రొత్త చరిత్రను సృష్టిద్దాం
అణ్వాస్త్ర అన్వేషణలు కాదు
అన్న వస్త్ర బీజాంకురార్పణ చేద్దాం
భారత్ - పాక్‌ల మధ్య
శతృత్వ కంచుకోట
'వాఘా' గోడను తొలగిద్దాం
ఏ బది రెండేళ్ళు సాగిన
నిరంతర శత్రుత్వ మనస్పర్థలు తరిమి
సౌభ్రాతృత్వం చాటిద్దాం
నిన్నటిదాకా కొనసాగిన హింసా ప్రతిహింసలు
పీడ కలయని తలచి ఇకనైనా మైత్రీ సంఘీ భావ
క్రొత్త పునాదులు నిర్మిద్దాం
గత చరిత్రను జీర్ణింపచేసి
భారత్ పాకిస్తాన్‌ల క్రొత్త శకాన్ని ప్రారంభిద్దాం
ఈ హర్ష గీతాన్ని
విశ్వమంతటిని చాటిచెప్పుదాం

నోట్.

19 ఫిబ్రవరి 99 ప్రపంచ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడిన పర్వదినం. భారత ప్రధాని శ్రీ అటల్ బిహారి వాజ్‌పాయి, పాకిస్థాన్ ప్రధాని శ్రీ నవాజ్ షరీఫ్‌లు నూతన అధ్యాయం తెరిచారు (రాడ్‌క్లిఫ్ 1947 అక్టోబర్ 11న వాఘవద్ద నిర్మించిన అడ్డుగోడ) రాడ్‌క్లిఫ్ అమృత్‌సర్ - లాహోర్ నడుమగల అడ్డుగోడ.

మందు పాతరలు

మనముందు
మందు పాతరలు
విరిగిన కాళ్ళు
తహతహలాడిపోతున్నాయి
ప్రపంచాన్ని తిరిగి చూడాలని కళ్ళు
కోరికలు ఫలించని అంగవైకల్యం
ప్రతి నిమిషం ఓ భయం
సామాన్యుల ప్రాణ సంకటం
ఆట బంతియని చిన్నారులు భ్రమ పడతారే తప్ప
వారికేమి తెలుసు అది అంగవైకల్యం చేస్తుందని
ప్రాణం దిగమింగుతుందని
మందు పాతరలకు బలి
మానవ జాతి సమస్తం !
వినబడలేదా ! కనబడలేదా !
బోస్నియా, జింబాబ్వే, మయన్మార్
సోమాలియా, సూడాన్, కంబోడియా
రువాండా, యుగాండా, భారతంలో నరసంహారం !
ధరణిపై ప్రతి నిమిషానికి **22**(ఇరువైరెండు) మంది
Land Mines (మందుపాతరల) కు
బలౌతున్నారని
సంఘ విద్రోహకాన్ని మనమంతా ఆపాలి
ఒక్క అడుగు ముందుకు వేస్తే చాలు !
ఐక్యంగా కదం కదం కదిపితే చాలు !!

(**29** మార్చి **1999** న నాగ్‌పూర్‌లో జరిగిన
Ban Land Mines National Conferenceలో
పాల్గొన్నప్పుడు స్పందించి)

ధర్మ సంస్థాపన

కృషితో ఫలించలేని ఆశయంతో
ఊహ కందని మలుపు తిరుగుతుంది జీవితం
దిక్కుమొక్కులేని స్థితులు
అయోమయంలో దేన్నీ ఎదురించలేని పరిస్థితులు !
ఓ సారి భగవంతుడున్నాడు,
వస్తాడు అని పుస్తకంలో చదివి నమ్మి ఎదురు చూశాను,
నీతి తప్పిన జాతిలోకి
ఎందుకొస్తాడని సంశయిస్తున్నాను
నాకు తెలుసు నా ఈ సంశయం అసందర్భమని
చరిత్రలెప్పుడో చెప్పాయి "ధర్మం దారి తప్పితే
బాధ సర్ప దృష్టులను ఉద్ధరించడానికి
భగవంతుడు తప్పక అవతరిస్తాడని
పురాణా లెప్పుడో ఘోషించాయి
పాపానికి అంతం తప్పదని
అంతిమ విజయం ధర్మానిదేననినూ !"
నేనేర్చిన చదువు,
చదువు నాకిచ్చిన విజ్ఞానం
ధర్మ సంస్థాపనకై అవతరించే
కొత్త అవతారానికై
క్షణ క్షణానికి లెక్కకడుతున్నాను
నా నిరీక్షణ ఫలిస్తే
అవతారాపురుషుడు ఆవిర్భావిస్తే
జరిగేది ధర్మ సంస్థాపన !

కంప్యూటర్

నా మనసు కంప్యూటర్
బటన్ నొక్కితే
హృదయం విండో తెరుచుకుంటుంది
రంగుల కలలు కొన్ని,
జీవితపు కబుర్లెన్నో
ఫీడ్ చేయబడియున్నాయ్
మీరు అలసిపోతారు
బటన్ ఆన్ చెయ్యకండి
నా మెదడు డిస్కులో
మీ అందరి చరిత్రలు
సురక్షితంగానే ఉన్నాయి
బహుషా మీరు మరచిపోయినా
మీ మేలు కీడుల బేరీజులను
నా మెదడు ఫ్లాపీ చూపిస్తుంటుంది
అన్నింటిని డిలిట్ చేయాలని అనుకుంటాను
కాని మిత్రద్రోహినవుతానేమోనని భయం
మిత్రత్వానికైనా, శత్రుత్వానికైనా
పవర్ అవసరమే !
మీకు తెలియదు
మీ టెంపరేచర్ ఎంత పెరుగుతుంటుందో
మీరు మరచినవి, మరవనివి
అన్నీ, నాలో రికార్డయి ఉంటాయి
బ్రతుకు బాటలో మీ నడవడికను
సరిదిద్దుకొనుటకు తోడ్పడతాయి
వాటిని నాలోనే భద్రంగా ఉండనివ్వండి.

నిర్వచనం

సిగరేటు పీల్చినంత సులభం కాదు జీవితం

అరటిపండు వలచినంత సునాయాసం మరీకాదు

ఎత్తు పల్లాలు, హొయలు లోయలతో

కూడినదే జీవితం

ఫుట్‌పాత్‌పై నడిచే మనిషికి

విలాసంలో సాగే భోగికి

తేడా ఏముందని మీరనుకుంటే

రెండు యుగాల చరిత్రకున్నంత

భేదం ఉందని నేనంటాను

అనుభవం అనుభూతితో

కూడుకున్నదే జీవితం

దాన్ని అనుభవిస్తే తప్ప

నిర్వచించలేం జీవిత నిర్వచనం

సంబరం కాని నా ఊరు సంబరం

సంబరం కాని నా ఊరు సంబరం
ఐదు సంవత్సరాల కోసారి
నా ఊరు సంబరంకాని సంబరం
జరుపు కుంటుంది
రాత్రి పగలు జనాల
వేడివేడి కబుర్లతో
కళకళలాడుతుంటుంది
పిల్లలు కూడా ఆడుకోలేని
స్థితిలో ఉన్న ప్లేగ్రౌండ్ -
భాగ్యం పండినట్లుంటుంది
ప్రతి గల్లీ, ఢిల్లీలా మురిసిపోతుంది
మంత్రులు, నేతలు
ఇంటింటి తలుపుతట్టి
ప్రజాస్వామ్యమని దండోరా కొడుతుంటారు.
అక్షరం తెలియని అంజయ్య
అబద్ధ మెరుగని రామన్న
సత్యాన్ని నమ్ముకున్న సత్యమ్మ
ఇలా ఎందరో అమాయకులు
నేతల బూటకపు వలలో చిక్కుకున్నవారే
వారిలో ఆశలు, ఆశయాలు
ఏ మాత్రం చెక్కుచెదర లేదు
వాళ్ళ కలలు ఫలించడానికి
ఎదురు చూస్తునే ఉంటాయి
అక్కడి పాడుపోయిన రహదారులు,

శిథిల కళాఖండాలు,
ఎండిపోయిన చెరువులు
వాడిపోయిన చెట్లు చేమలు
చెదిరిపోయిన గుళ్ళు గోపురాలు
మసీదు, చర్చి, గురు ద్వారాలు
కూలి పోయిన పూరి గుడిసెలు
మాడి పోయిన పంట పొలాలు
వెలుగివ్వని వీధి స్తంభాలు
సజీవంగానే కన్పిస్తుంటాయి
ఇక నుండయిన ఊరు బాగుపడుతుందన్న
ఆశ వారిని వెంబడిస్తుంటుంది.
ఆశలు ! ఎన్నిరకాల ఆశలో !
డిగ్రీ చదివిన కుర్రోడికి
పొట్టగడిచే ఉద్యోగం వస్తుందనీ
స్వాతంత్ర్య సమరయోధ పారితోషికం
వృద్ధాప్య పింఛనో! వేచివేచి ఒక వసంతం చిగురిస్తుందనీ !
ఈ లోపే
పార్టీ మెని ఫెస్టోలు
వారి ముందు మెరిసిపోతుంటాయి
నేతల పైపై హామీల వర్షం కురుస్తునే ఉంటుంది
గల్లీల సహకారంతో
గెలిచిన నేత ఢిల్లీలో మకాం చేస్తే
ఆపై "నా ఊరు గతి, ఏమిటా సంగతి" అన్నట్లు
నివ్వెర బోతుంటుంది
సంబరంకాని నా ఊరు సంబరం చేసుకుంటుంది.

అక్షర కిరణం

అజ్ఞానపు తిమిరాలలో
అలుముకున్న చీకటిలో,
వేకువలా పొడిచింది అక్షర కిరణం !
ప్రతి కిరణం అక్షరమై
అక్షరమిక సుస్థిరమై
పసిడి వెలుగు ఒడిదాల్చిన
నవ్యభవ్య జగతిపై
పాకింది అక్షర కిరణం !
రాతియుగం ఛాయలను
మటుమాయం చేయగా
కాంతులు వెదజల్లుతూ
ఆదిమ వాసిడిని సైతం
వేద వేద్యుడిని చేసి
వైవిద్యం చూపింది అక్షర కిరణం !
ఈ వైవిద్యంతోనే నేటి ప్రపంచం
విజ్ఞానపు పునాదుల్ని నిర్మించుకుని
ప్రగతి రథం కదులుతోంది అంతరిక్షం వైపు
యుగాలుగా ధరిత్రిపై చరిత్రలెన్ని పుట్టినా
ఆ చరిత్రలకు లిపి కూర్చిన
పరికరమే విద్య !
విద్యలేని వాడు వింత పశువనే తలచి
చదువుకొఅకు కదలండి
అక్షర కిరణంవైపు....

ఆర్య జీవన్

ద్విభాష పక్ష పత్రికలో
30 ఏప్రిల్ 2001 న ప్రచురించబడినది

నా ప్రతి అక్షరం

నా ప్రతి అక్షరం
చందమామ అంచుల్లోంచి
వెలువడింది కాదు
మిమ్మల్ని వెచ్చని సుఖ నిద్రనిచ్చేది
అంతకన్నా కాదు
ఆకాశ మబ్బుల్ని ఛేదిస్తూ,
ఆగ్ని జ్వాలలు
ఉరుములు, మెరుపులు ఉద్వేగ భరిత తేజస్సు
నా ప్రతి అక్షరం ఓ సూర్య గోళం
మొలకెత్తే విత్తనానికి,
తెలుసు భారం
అదే నా ప్రతి అక్షరం

అక్షర భావాలు

భావాలు నాతో దోబూచులాడుతున్నాయి
బెంగపడ్డ నన్ను చూసి నవ్వుకుంటున్నాయి
అక్షరాలు నాముందు ఆట్లాడుకుంటున్నాయి
ఏర్చి - కూర్చి వాటిని లక్షల పదాలుగా మార్చి
మీ దరికి చేర్చమని ఉబలాటపడుతున్నాయి
'రాగా'లో చెలరేగే రూపాలు లేని భావాలకు
ఓ రూపం ప్రసాదించమని ఆజ్ఞాపిస్తున్నాయి.

నిర్భాగ్యులు

ఏ ఊరు గాథ విన్నా ఏముంది
ఏ పూరి గుడిసె కలకన్న ఏముంది
కన్నీరుగూటిలో ఆరిపోతున్న
చిరు దివ్వెల జీవితాలు
గొంతు తడిస్తే చాలు అదే పదివేలు
ఎప్పుడు రోధిస్తునే ఉంటారు
ఆఖరి క్షణం వరకు పోరాడుతునే ఉంటారు
విధి వ్రాతయని తలుస్తూ !
వాళ్ళ చేతులు కేవలం పార పట్టుటకే
గొప్ప వాళ్ళంటెనే భయం
గొప్ప వాళ్ళ గోత్రాలెరుగని అమాయకులు
అందుకే రాజకీయ గిర్నీలో నుగ్గవుతుంటారు
అయినా గుండెలో దాగిన రోదన
బరువెక్కి పెదవుల దాకా రానివ్వరు
లోలోపలే జీర్ణించుకుంటారు
మోజుతో తులతూగుతున్న
నగర అందాల్ని చూసి ద్వేశించుకోరు
నగరాలకు తెలియకుండా
నగర భారాల్ని మోస్తున్న
ప్రతి ఊరు
మౌనంగానే ఉంటుంది !

నా కవిత

స్పష్టంగా ముఖము కనబడని శిల్పంలా నీ కవిత
అని మీరంటే పలుచని ముసుగేసుకున్న
అందమైన అతివ నా కవితంటాను
అస్తవ్యస్తంగా గీచిన ఓ చిత్ర కారుడి
బొమ్మనీ కవితంటే చేజారిన తేనీయ
నా కవితంటాను
గగనాన్ని అలంకరించిన
వర్ణాలన్నీ నా కవితేనంటాను !
రూపంలేని రాళ్ళల్లా నీ కవితని మీరంటే
స్థిరమైన భావాలే రాళ్ళల్లా దర్శనమిచ్చె
నా కవితంటాను
గట్టి పునాది లాంటివి
నా కవితలంటాను
నీ కవితలలో
సుకుమారత్వం లేదని మీరారోపిస్తే
కందిపోయె కుసుమాలను చూపిస్తే
లలిత, లలిత పదాలు చూపిస్తాను
లలిత - లలిత మధుర భావాలను,
లోకాలను
దర్శించేల చేస్తాను
గొంతెత్తి సుకుమార పదాలతో

కట్టు బడ్డ
కల్పన లోకానికి
స్వాగత గీతాలాపన
చేస్తాను చేయిస్తాను
ఇది ఓ కవితేనా
అని మీరు పెదవి విరిస్తే
కవితా మధురిమ
మీ అధరాలను
అలరించిందని
మీకు గుర్తు చేస్తాను
నా కవితా సౌరభాలు
మీ దేహం తోటే
అంటి పెట్టుకున్నాయని
మరువ కండని
హెచ్చరిస్తాను
నవ్వు కుంటాను
మీ సలహాలకు,
అభిప్రాయాలకు
ధన్య వాదాలు తెల్పుతూ
సెలవు గైకొంటాను.

నా మౌనం

నా మౌనాన్ని మరోలా
అనుకోకండి
ఆరోపణలు చేస్తే
కలత పడ్డ మనస్సు
కఠినంగా మారుతుంది
ఎంతటి
గాయాన్నైనా కల్గిస్తుంది
ఆరోపణలతో గాయపడ్డ మది
ప్రత్యా రోపణలకు
సిద్ధమౌతుంది
ఫలితం !
ఆనందం ఉన్నచోట
అశాంతి రాజ్యమేలుతుంది
విశ్వాసాన్ని కూలదోసి
అవిశ్వాసం తన
విశ్వ రూపాన్ని చూపుతుంది
ఆనంద చిహ్నాలను రూపు మాపుతుంది
అందుకే ప్రత్యారోపణ చెయ్యక
మౌనంగా ఉన్నాను
నా మౌనాన్ని నా అపజయంగా భావిస్తే
నా మౌనాన్ని చేత కాని తనంగా భావిస్తే
వక్ర భాష్యం చెప్పినట్లే !
పొరపాటు చేసినట్లే !!

హాయిగా ఉంది నేస్తం !

హాయిగా ఉంది నేస్తం !
ఎంత హాయిగా ఉందో చెప్పలేను
ఆప్తమిత్రుల కలయికతో
కాస్తంత వేదన తీరింది
తీరిన వేదనతో రోదన తగ్గింది
మనస్సు జ్ఞాపకాలలో మునకలు వేసి,
గతంతో కాస్తంత ముచ్చటించి,
మరి ఊరట డిల్లింది.
ఎంత హాయి ! ఎంత మజా !
ఎండమావుల్ని వెంటాడి
నిరాశ చెందిన మదికి, నీటికై తపిస్తున్న మదికి
నీటి దర్శనం ఎంత హాయి నిస్తుందో
అంత హాయిగా ఉంది.
ఎప్పుడెప్పుడు కురుస్తుందోనని,
ఆశగా, దీనంగా, ఆకాశానికేసి
చూసే బక్క రైతుకు,
అకస్మాత్తుగా కురిసిన చల్లని వర్షం
ఎంత హాయినిస్తుందో,
అంత హాయిగా ఉంది నేస్తం !
నగరపు సమూహంలో నీవు ఒకడిగా మారి
యాంత్రిక జీవితాన్ని గడుపుతున్నప్పుడే
నీహృదయం గాయపడ్డ కపోతం అయ్యి
విలపిస్తున్నప్పుడే, అప్పుడే,
తళుక్కుమంటు మెరిసిన నా జ్ఞాపకం

ఓదార్పునిచ్చిందని, మందులా మారిందని
చదివి,
ఉదాసీనంగా ఉన్న నామనస్సుకు
నూతనోత్సాహం కల్గి హాయిగా ఉంది
కల్లలయిన కలల గూర్చి,
బరువుగా సాగుతున్న బతుకుల గూర్చి
కష్ట సుఖాల గూర్చి, కాక
మదులలో వీచిన జ్ఞాపకాల
సమీరం గూర్చి,
ఉత్తరాలలో మనం ముచ్చటించిన
వైనం గుర్తుకొచ్చి,
ఎందుకో వెలితిగా అన్పించక
అబ్బురంగా ఉంది !
బహుశ ఆ ఉత్తరాల స్థానంలో
మనం పరస్పరం నిలబడి
సంభాషించుకుంటున్నామేమో !
ఆ భావమే రమ్యంగా
అపురూపమైన హాయిగా ఉంది నేస్తం !

అవసర వాదులు

అధికారం కావాలని
సాధురూప వలలు ఒడుకుతూ
కుర్చీలవైపు నిరీక్షిస్తున్నాయి పార్టీలన్నీ
ఎటు చూచినా
మానవత్వం వల్లబోసే మాటలే
ఓటుబ్యాంకు నటనలే !
గతమంతా ఓ మచ్చుతునక
ఓ పీడకలయని
ప్రజల్లో క్రొత్త పోకడలేర్పరచి
గతంలో చెప్పిన వాళ్ళే...
మళ్ళీ భాగస్వాములై...
మచ్చలున్నా మచ్చుకైనా కనబడక
గుర్తు పట్టరాని మైమరపులే !
వారు అవసరవాదులుగా
అసలు కనపడరు కదా !

(వార్తా దిన పత్రికలో
24 డిసెంబరు **2001** న ప్రచురించబడినది)

సత్యాన్వేషణ

నిత్యం సత్యం చెప్పి
ఓ మార్గాన్ని అనుసరిస్తే
అసత్యుడు
అసభ్యుడని విస్మరిస్తారు.
కాని
దాని పైనే అసత్యమనే
పూత పూస్తే అది
నిజం అని, సత్య,
సభ్యుడని స్మరిస్తారు.
అందుకే
నిత్యం మౌనం పాటిస్తా
అసత్యాన్ని చెంత చేరనీయక
మౌనంగా ఒంటరినై
మానవత్వమున్న
మనుషులను
అన్వేషిస్తా.

ఆశావాది

మనసు మార్చుకోలేక
మమతలు మరవలేక
వేదనలో మరి ఆవేదనలో
మమతాను రాగాల్నే గాలిస్తున్నా
ఎంత కఠోరమైన ఆలోచనలైనా
హృదయంలోనే
మంచులా కరిగించుకుని
ప్రేమ అంచు నీడలో
జీవిస్తున్నా ఆశావాదిగా
పెదవి విప్పలేని
మూగ మనసుకు తెలుసు
దీనం, మౌనం, భారం
అయినా
చివరికి కాల చక్రంలో కలిసి
ఓ బాట సారిగా పయనిస్తున్నా
ఎవరికి చెబితే ఏముంది !
కన్నీళ్ళు రాలి
గుండెలోని గాయాల్ని మాన్పిస్తుంటే
కవితా ప్రపంచంలో
ముందుకు సాగిపోతున్నా
ఆశావాదిగా

ఎలా చెప్పుకోను

ఎలా చెప్పుకోను !
క్రొత్త పరిచయాలు
కొద్ది కాలంలోనే
మరీ పాతవై విడిపోవునప్పుడు
నా మనస్సులోని వ్యధ, తపన
విరహ వేదనల్ని
విడిపోయే వేళ నాకను రెప్పలు
వర్షాలు కురిపించాయని
తనవి తీరని నా మనసు
బదులు పల్కక మూగ బోయిందని
నే విడిపోయే వేళ నా అధరాలు
తడిసి వణకి పోయాయని
గుండె దిగులు చెంది
ముక్కలై పోయిందని
విడిపోయే వేళ
పాడిన పాటలు ఆడిన మాటలు
నాలోనే వాడిపొమ్మని
చేతులు కలసి చేసిన
వాగ్దానాలన్నిటిని మరచిపొమ్మని
విడిపోయే
రెండు క్షణాల ముందు
ప్రేమానురాగాలు
మరీ పెరుగుతున్నాయని
నిను విడిపోయి
నీ స్మృతులను తలుస్తూ, నా
అంధకార జీవిత తలుపులు
నన్ను ఆతురతతో
ఎలా ఆహ్వానిస్తున్నాయో అని

మనమంతా కలలం

మనమంతా కలలం !

కలలెప్పుడు మన స్వంతం కావు !

పట్టు దారాల కంటె

సున్నితమైనవి మన

బాంధవ్యాలు

కేవలం స్పర్శ మాత్రంచే

విరిగిపోయే కలలవంటి

వాళ్ళము మనము

నేటి మాట రేపు గతించిన

మళ్ళీ స్వప్నాల రూపంలో

స్మృతి పటలంలో ఉదయిస్తుంది

అందుకే మళ్ళీ మళ్ళీ

అంటాను నేను

మనమంతా బలహీనమైన

అస్తిత్వాలను కోల్పోయే

కలలమని

మూసీ గతం !

జనాలు అంటుంటారు అప్పుడప్పుడు,
ఈ మూసీ ఒకప్పుడు మురిపించేది, మరిపించేది
హొయలు పోతూ, సుడులు తిరుగుతూ
అచ్చు అడవిలో నాట్యం చేస్తున్న నెమళ్ళను
గుర్తుకు తెస్తూ

నిండుగా పయనిస్తుంటే, గంభీరముగా ఉండేది
ఓ నిండైన యువతి ఒయ్యారంగా
నడిచినట్లుండేది.

ఎన్ని జంటలు, మూసీ ఒడ్డున కూర్చుని, కాలాన్ని మర్చి,
ముద్దు ముచ్చట్లలో తేలియాడేవని !
పచ్చని పచ్చిక చీర అంచులా ఆకర్షణీయంగా ఉండేది.
వరదలు వచ్చినప్పుడు మాత్రం యమభయంకరంగా,
ధీర గంభీరముగా ఉండేది.

ప్రియురాలి పొందుకై చెరసాలను ఛేదించి మూసీయే వంతెనగా
చేసిన కులీకుతుబ్‌షాను మురిపించేది.
ప్రజలకు నీరందించిన పుణ్యనది ఈ మూసీ
ఆనందం పంచి ప్రేరణ కల్గించినది ఈ నదియే
కులమతాలను మరిచి, నదిలో మునిగి
ఓ కొత్త సంస్కృతికి, ఓ ప్రత్యేకమైన భాషకి జీవం
పోసింది ఈ మూసీయే

సహానుభూతి

అవును మీరంతా

సహానుభూతి ప్రకటించే అధిపతులు !

వాళ్ళ చేతులు తెగినా

చక్రంలో కాలు విరిగినా

చివరకు నడి చౌరస్తాలో

ప్రాణం వేలం వేయబడినా

మీరు ప్రకటిస్తారు సహానుభూతి.

వందనాలు

వందనాలు వందనాలు

జిహ్వేశ్వర్ మహారాజ్‌కి వందనాలు

సమతా మమతానురాగాలతో

చల్లగ మమ్ములను దీవించే మా

కులగురువుకు వందనాలు - అభివందనాలు

దివ్య జ్ఞానోపదేశము లిచ్చి

ఆదిగా, వెలుగు బాటను చూపి

జనులెల్లరకు ఆపద్బాంధవుడై

జగతిలో ఖ్యాతిగ నిల్చిన

దయానిధి గురువుకు పాదాభివందనాలు.

అనాదిగా చెలరేగే గాఢాంధకారంలో
మనమందరం అజ్ఞానపు సముద్రంలో మునిగి
అహర్నిశలు వేదన - ఆ వేదనలో పీడితులమై
ఏకధాటిగా సతమతమౌతుంటే, మమ్ములను
మేల్కొలిపిన మా కులగురువుకు చరణాభివందనాలు

న్యాయ, ధర్మ జ్ఞాన జ్యోతులతో
మన దివ్యమైన సంస్కృతిని వెలిగించి
మనలో విద్యా భక్తి వినయ శీలాన్ని పెంచి
మమ్ములను సరళ మోక్ష మార్గాన్ని చూపే
మా గురువులకు శిరసాభివందనాలు

జగతికి సమాజ ప్రగతికి
దివ్య జ్ఞానామృతోపదేశముల నిచ్చి
స్వకుళసాళి సమాజ బంధువుల జీవితాలను
ధన్యము చేయమని పదేపదే కోరుతూ
'రాగా' కులగురువులకు కోటి కోటి వందనాలు

(ఆల్ ఇండియా
11వ స్వకుళ సాళి సావినర్
2001లో ప్రచురించబడినది)

శ్రామికుల్లారా !

కపటాలెరుగని సామాన్యులైన
ఓ శ్రామికుల్లారా! గంటల తరబడి
రెక్కలు ముక్కలైన డొక్కలు సైతం
యంత్రాలకంకితం చేసే
దీనుల్లారా! శ్రమ జీవుల్లారా !!
ఫలించని ఆశలు మీ ఆకాంక్షలు
రెండు సజాతి ధ్రువాలు
రెండు విజాతి ధ్రువాలుగా
సదా వికర్శించబడుతున్న
ఆశా జీవుల్లారా! శ్రామికుల్లారా !!
తూర్పున ఉదయించే మీ ఆశలు
స్వేద నదులను ప్రవహింప చేసిన
మీ కష్టాన్ని దోపిడి చేసుకొని
దుష్ట శక్తులు దర్జాగా ఏలుతుంటాయి
అమాయకుల్లారా! ఓ శ్రమికుల్లారా !!
మీ కండల గాయాలు తొలగకముందే
అలసి అలమటించి ఊపిరి పీల్చక ముందే
పెదవిపై చిరునవ్వు పవళించక ముందే
మీ జీవితాలు ఇనుప చక్రాల్లో
రాజకీయ రాబందుల బుసలకి
కుటిల నీతి ఒత్తిళ్ళలో నలిగి
పడమరలో అస్తమిస్తుంటాయి
శ్రామికుల్లారా ! ఆశా జీవుల్లారా !!

కురుక్షేత్రం

కురుక్షేత్రంలో

కురు వృద్ధులను చూసి

కుంతీ పుత్రుడు

కంపించి పోయాడు

భయంతో కాదు

తన వాళ్ళను

తానే వధించాలనే

ఆలోచనతో !

నేను కూడా

భావాల కురుక్షేత్రంలో

పార్థునిగా నిల్చున్నా

ప్రతి భావన నాదే

ఒకప్పుడు

మమతలు పంచిపెట్టినవే

వాటినెలా హతమార్చేదని

ఈ ఆలోచన

తట్టిన వెంటనే

పుత్ర శోకంతో

తపించిన గాంధారిలా

నా హృదయాన్ని తట్టి

మెల్లగా చెప్తున్నారు

దాన్ని కేవలం

నేను మాత్రమే వింటాను

"నీలో జన్మించిన

ఆలోచనలు

చివరకు

నీలోనే

విలీన మౌతున్నప్పుడు

దుఃఖ మెందులకు"

అప్పుడు

మరణ శయ్యపై ఉన్న

భీష్మ పితామహునివలె

ఒక మందహాసం

నా పెదాలపై

వచ్చింది.

రాగా లాపన - 2

పెదవుల్లో దాగిన నిజం

కళ్ళలో బహిర్గతమవుతుంది

కళ్ళు నిశ్శబ్దంగా మాట్లాడతాయి

రహస్యం మనసు విప్పకపోయినా

ఊపిరితో బయటకు వస్తుంది

సునాయాసంగా నే

జీవిత గమనంలో

సుఖదుఃఖాలు సహజం

సుఖం చెప్పని చేదు నిజం,

దుఃఖం చెపుతుందినీ

మస్తిష్కంలో నా జ్ఞాపకాలు

ఆట్లాడుతాయి

సదానీమది 'రాగా' లాపన

చేస్తుంటాయి

(ఆంధ్రభూమి సచిత్ర
వార పత్రికలో 16 నవంబర్
2000 న ప్రచురించబడినది)

నవ వార్షికా ! స్వాగతం !

ఓ నవ వార్షికమా !
నువ్వు త్వరగా రావాలి
కలువకు ప్రాణమై
కాంతి కిరణమై
నువ్వు రావాలి నవ వార్షికమా !
నీ రాకతో
ఆకలి మంటలను ఆర్పాలి
కన్నీటి ధారలు ఆపాలి
దీనుల కష్టాలు తొలగాలి
క్రొత్త కాంతులు వెలగాలి
రైతు పెదాలపై చిరునవ్వులు విరజిల్లాలి
నిరుద్యోగ సమస్యలు తీరాలి
నువ్వు రావాలి నవ వార్షికమా !
భ్రష్టాచారాలు పైదొలగాలి
అసమానతలు రూపుమానాలి
ఉగ్రవాదం అణగాలి
నీ రాకతో చెడుజ్ఞాపకాలు చెరిగి
గత వత్సర నష్టాలు తొలిగి
కాల గర్భంలో కలిసి పోవాలని
మమత ముత్యాలతో నిన్ను
అలంకరించాలని "రాగా"లతో
మనసార ఆహ్వానిస్తున్నాను
ఓ నవ వార్షికమా! స్వాగతం !